PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 308 | విజయవాడ, గురువారం 13 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 13 June 2024 | Rs

చంద్రబాబుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ నజీర్

చంద్రబాబు నాయుడు అను నేను..

- 4వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- ప్రధానితో పాటు పలువురు ప్రముఖుల హాజరు
- కిక్కిరిసిన సభా ప్రాంగణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అశేష ప్రజానీకం సమక్షంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలోని ఐటపార్కు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన ప్రమాణ స్వీకారం చేస్తున్నంత సేపు సభాప్రాంగణం హర్షధ్వానాలతో మారుమ్రోగింది. 'జై చంద్రబాబు' అంటూ 'సిఎం..సిఎం' అంటూ టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జెపి నడ్డా, నితిన్ గడ్కరీతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే వారందరూ చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రధాని అభినందనలు తెలియచేస్తున్నప్పుడు చంద్రబాబు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మోడీ కూడా అదే రీతిలో స్పందించారు. అంతకుముందు పదవీప్రమాణ స్వీకారంతో పాటు, ప్రభుత్వ రహస్యాల పరిరక్షణ ప్రమాణం కూడా చంద్రబాబు చేత గవర్నర్ చేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాల్గవ సారి. ఉమ్మడి రాష్ట్రంలో 1995లో మొదటి సారి , 1999లో రెండో సారి ఆయన ముఖ్యమంత్రిగా విధులు నిర్వహించారు. రాష్ట్రవిభజన అనంతరం 2014లో మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలోనూ సభాప్రాంగణం నినాదాలతో హోరెత్తింది. కొందరు జనసేన కార్యకర్తలు సిఎం,సిఎం అంటూ నినాదాలు చేయడం వినిపించింది. పవన్ ప్రమాణం చేస్తున్న సమయంలో చిరంజీవి, నాగబాబులతో పాటు ఈ కారక్రమానికి ప్రత్యేకంగా హాజరైన మెగా కుటుంబ సభ్యులు ఉద్విగ్నతకు గురయ్యారు. పవన్ తరువాత వరుసగా నారా లోకేష్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, ఎన్‌ఎండి ఫరూక్, ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల, కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డొలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బిసి జనార్ధన్ రెడ్డి, టిజి భరత్, సంజీవ రెడ్డి సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డిల చేత గవర్నర్ ప్రమాణం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

> "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యాను. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేసిన వారికి నా అభినందనలు. ఆంధ్రప్రదేశ్‌ను నూతన కీర్తిశిఖరాలకు తీసుకెళ్లడానికి, రాష్ట్ర యువత, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది."
>
> ప్రమాణ స్వీకారం అనంతరం ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోడీ

మరిన్ని వార్తలు, కథనాలు లోపలి పేజీల్లో

నేడు సంతకాలు....

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నేటి సాయంత్రం 4.41 గంటలకు సచివాలయంలో మొదటి బ్లాకులో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ వెంటనే ఎన్నికల ప్రచార సమయంలో ప్రజల కిచ్చిన హామీల మేరకు పలు కీలకఫైళ్లపై సంతకాలు చేయనున్నారు. చంద్రబాబు కార్యాలయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం మెగా డిఎస్‌సి ఫైలుపై ఆయన తొలి సంతకం చేస్తారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ రెండో సంతకం చేయనున్నారు. సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచుతూ మూడవ ఫైలుపై, స్కిల్ సెన్సెస్ ఫైలుపై నాల్గవ సంతకం, అన్న క్యాంటిన్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైళ్లపై ఐదవ సంతకం చేయనున్నట్లు సమాచారం.

ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, కొత్తమంత్రుల గ్రూప్ ఫోటో

నేటి నుంచి బడి గంట

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవులు అనంతరం తిరిగి తెరుచుకోనున్నాయి. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు తెరుచుకోనున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాలేదన్న కారణంతో ఇప్పటి వరకు పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించలేదు. పాఠశాలలు ఎన్ని రోజులు నడుస్తాయి, దసరా, సంక్రాంతి, క్రిస్మస్, దీపావళి సెలవులు ఎన్ని రోజులు, ఫార్మెటివ్ అసెస్‌మెంట్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణ ఎప్పుడనేది రూపొందించలేదు.

సాయంపై రైతు ఉత్కంఠ

- సిఎం తొలి సంతకాల్లో ఆ ఫైల్ లేదు
- పిఎం కిసాన్‌తో కలిపేనా, విడిగానా?
- తరుముతున్న ఖరీఫ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పెట్టుబడి సాయం కోసం ఖరీఫ్ రైతు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాడు. ఎన్నికల అనంతరం గురువారం రాష్ట్రానికి నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం, మంత్రి మండలి ఏర్పాటు ముగియడంతో అన్నదాతల్లో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంపై ఊహాగానాలు మొదలయ్యాయి. దానికితోడు సోమవారం ప్రధానిగా మోడీ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తూ రైతులకు 'పిఎం కిసాన్' 17వ కిస్తు (ఈ ఆర్థిక సంవత్సరం తొలి కిస్తు) విడుదల ఫైల్‌పై తొలి సంతకం చేయడంతో రైతుల్లో పెట్టుబడి సాయంపై చర్చలు జోరందుకున్నాయి. టిడిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 'సూపర్ సిక్స్' హామీల్లో రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అనేది ప్రధానమైనది. ప్రస్తుతం ఈ అంశంపైనే వ్యవసాయదారుల్లో ఆసక్తి నెలకొంది. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సచివాలయంలో బాధ్యతల స్వీకరణ సందర్భంగా చేసే తొలి ఐదు సంతకాల్లో 'రైతులకు ఆర్థిక సాయం' ఫైలు లేదని సమాచారం. నైరుతి రుతుపవనాలతో రాష్ట్రంలో వర్షాలు పడుతుండటంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సంసిద్ధమవుతున్నారు. ముంగిట్లోనే ఏరువాక పౌర్ణమి ఉంది. ఆ రోజున లాంఛనంగా రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. కరువు, తుపాన్‌తో గతేడాదంతా భారీ నష్టాలు చవిచూసిన రైతులు పెట్టుబడుల కోసం వెతుక్కుంటున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న ఆర్థిక సాయంకేసి ఆశగా ఎదురు చూస్తున్నారు.

విడిగానా? కలిపేనా?

వైసిపి సర్కారు నవరత్నాల్లో భాగంగా ఏడాదిలో మూడు కిస్తుల్లో రైతు భరోసా పేరిట రూ.13,500 రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. అందులో రూ.6 వేలు కేంద్రానివి కాగా రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వానివి. అందుకే 'వైఎస్‌ఆర్ రైతు భరోసా- పిఎం కిసాన్' అని ఆ పథకానికి పేరు పెట్టి అమలు చేసింది. వైసిపి వలే టిడిపి ప్రభుత్వం కూడా పిఎం కిసాన్‌తో కలుపుకొని రూ.20 వేలు ఇస్తుందా? లేదంటే తాను చెప్పిన విధంగా రాష్ట్ర ఖజానా నుంచి మొత్తం రూ.20 వేలూ అందిస్తుందా అనే విషయాలపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. అలాగే విడతల్లో ఇస్తుందా, ఒకే సారి ఇస్తుందా అనేదానిపైనా ప్రభుత్వంలో అవగాహన లేదు. కేంద్రంతో కలపకుండా ఉంటే రైతులకు ఏడాదికి రూ.26 వేలు అందుతాయి.

నిబంధనలు ఖరారు కావాలి

2019 ఎన్నికల ముందు మోడీ ప్రభుత్వం పిఎం కిసాన్ మొదలు పెట్టింది. కౌలు రైతులకు సాయం లేదంది. అదే సమయంలో టిడిపి సర్కారు 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రకటించింది. పిఎం కిసాన్‌తో కలిపి రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని అప్పట్లో జిఓ కూడా ఇచ్చింది. కౌలు రైతులకు రాష్ట్ర ఖజానా నుంచి ఇస్తామంది. అప్పటికే ఎన్‌డిఎ నుంచి టిడిపి వైదొలిగింది. ప్రస్తుతం తమది ఎన్‌డిఎ ప్రభుత్వమని టిడిపి ప్రకటించింది. అలాంటప్పుడు కేంద్ర పథకంతో కలిపే అమలయ్యే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొదటి నుంచీ మోడీ ప్రభుత్వం కౌలు రైతులకు సాయం చేయలేదు. వైసిపి సర్కారు కౌలు రైతులకు రాష్ట్ర ఖజానా నుంచి ఇస్తామన్నా నామమాత్రంగానే ఇచ్చింది. టిడిపి సర్కారు కౌలు రైతులకు ఇస్తుందా అనే విషయంపై సైతం స్పష్టత లేదు. రైతులకు ఆర్థిక సాయంపై ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి ఉత్తర్వులిస్తేనే స్పష్టత వస్తుంది. అర్హతలేమిటి, ఎంత మంది రైతులకు, కౌలు రైతులకు సాయం చేస్తారనేదీ ఉత్తర్వుల్లోనే వెల్లడవుతుంది. అందుకు సమయం పడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ముద్దాడ రవిచంద్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య కార్యదర్శిగా ఐఎఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏడాదికాలంగా వెయిటింగ్‌లో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేర్వేరు చోట్లకు తిప్పుతూ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పాల్జేసింది. ఏడాది నుండి అతనికి పోస్టింగు కూడా ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచింది. అయితే నూతన ప్రభుత్వం సిఎం పిఎస్‌గా ఆయనకు అత్యంత కీలకమైన బాధ్యతలు అప్పగించింది.

పాడేరు ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

- వ్యాన్ బోల్తా పడి ముగ్గురు దుర్మరణం
- 9 మందికి తీవ్ర గాయాలు

అమరావతి, పోలవరానికి ప్రాధాన్యత

- నేడు సిఎం హోదాలో చంద్రబాబు తొలిసారి చర్చించే అవకాశం

యుద్ధ నేరాలకు పాల్పడిన ఇజ్రాయిల్

- ఐరాస విచారణా కమిషన్
- హమాస్ పైన విమర్శ

లోపలి పేజీలో..

కువైట్‌లో ఘోర అగ్ని ప్రమాదం

- 49 మంది మృతి
- మృతుల్లో ఎక్కువ మంది భారతీయులే!
- 50 మందికి గాయాలు

కువైట్ సిటీ : బుధవారం తెల్లవారుజామున కువైట్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 49 మంది చనిపోయారు. మరో 50 మంది దాకా గాయపడ్డారు. మృతుల్లో భారతీయులు మరీ ముఖ్యంగా మలయాళీలు, తమిళులే ఎక్కువ మంది ఉన్నట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది. గాయపడినవారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఆసుపత్రివర్గాలు తెలిపాయి. కువైట్‌లోని దక్షిణ అహ్మదీ గవర్నరేట్‌లోని మంగాఫ్ ప్రాంతంలోని ఆరు అంతస్తుల భవనంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ముందుగా వంటగదిలో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే భవనమంతా వ్యాపించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ భవనంలో సుమారు 200 మంది వరకూ నివాసం ఉంటున్నారు. ఈ ఘటనలో 43 మంది మంటల్లో సజీవదహనమవ్వగా.. మరో ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 40 మంది వరకూ భారతీయులేనని అధికారులు అనుమానిస్తున్నారు. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో ఊపిరాడక, కొందరు, మంటల్లో చిక్కుకుని మరి కొందరు చనిపోయినట్లు అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాదానికి గల కారణాలపై క్రిమినల్ ఎవిడెన్స్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నట్లు కువైట్ ప్రభుత్వం వెల్లడించింది. చట్టాన్ని ఉల్లంఘించిన భవన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.. అగ్ని ప్రమాదాన్ని ఎన్‌బిటిసి గ్రూపు అద్దెకు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇది కువైట్‌లో అతిపెద్ద కాంట్రాక్టు భవన నిర్మాణ సంస్థల్లో ఒకటిగా పేరుగాంచింది.

కువైట్‌లో మొత్తం జనాభాలో భారతీయులు 21 శాతం (10 లక్షలు), దాని శ్రామిక శక్తిలో 30 శాతం (సుమారు 9 లక్షలు)గా ఉంటారు. ఈ ప్రమాదంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన భారతీయులకు అందుతున్న సహాయాన్ని పర్యవేక్షించడానికి, మరణించిన వారి మృతదేహాలను త్వరగా స్వదేశానికి రప్పించడానికి విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ కువైట్‌కు బయలుదేరి వెళుతున్నారు. అలాగే, ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కువైట్‌లోని భారత రాయబారి ఆదర్శ్ స్వైకా సందర్శించారు. అలాగే గాయపడిన భారతీయులు చికిత్స పొందుతున్న అల్-అదాన్, ఫర్వానియా, వంటి ఆసుపత్రులను సందర్శించారు. రాయబార కార్యాలయం నుంచి పూర్తి సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

రెండు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు ఉగ్రవాదులు, ఒక జవాన్ మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లల్లో ఇద్దరు ఉగ్రవాదులు, ఒక జవాన్ మృతి చనిపోయారు. మరో ఆరుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఈ నెల 9న బస్సుపై ఉగ్రదాడి జరిగిన తరువాత కొద్ది రోజులకే ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.కతువా జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు సాగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు, ఒక జవాన్ మృతి చెందారు. చనిపోయిన జవాన్ పేరు కబీర్‌దాస్ అని అధికారులు తెలిపారు. భద్రతా దళాలు వెల్లడించిన సమాచారం ప్రకారం సరిహద్దు దాటి జిల్లాలోని సైదా సుఖాల్ అనే గ్రామంలోకి ఇద్దరు ఉగ్రవాదులు చొరబడినట్లు సమాచారం అందడంతో సిఆర్‌పిఎఫ్ బలగాలు అక్కడికి చేరుకుని ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయని, ఈ సందర్భంగా ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో జవాన్లు ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్ సుమారు 15 గంటల పాటు సాగింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కబీర్ దాస్ ఇటీవలే సెలవులు తరువాత ఎనిమిది రోజుల క్రితం విధుల్లో చేరాడు. ఇతనికి నాలుగేళ్ల క్రితమే వివాహం జరిగింది. అంత్యక్రియల కోసం కబీర్‌దాస్ మృతదేహాన్ని గురువారం చింద్వారా జిల్లాలోని బిచువా తాలుకాలోని స్వగ్రామం పుల్పుల్ దోహాకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో స్థానిక పౌరుడు గాయపడ్డాడు. అతని పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు చెబుతున్నారు.

దోడా జిల్లాలోని ఎన్‌కౌంటర్ ప్రదేశం వద్ద మోహరించిన పోలీసులు

దోడా జిల్లాలో..

దోడా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. జిల్లాలోని ఛటర్‌గాలా ప్రాంతంలో ఉన్న జాయింట్ చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంతో భద్రతా సిబ్బంది ఎదురు కాల్పులు జరిపాయి.. ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు భద్రతా సిబ్బంది, ఒక ఎస్‌పిఒ గాయపడ్డారు.

కొలువుదీరిన కొత్త మంత్రులు

ప్రధాని మోడీ, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రబాబు మంత్రివర్గంలో మొత్తం 24 మంది బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రితోపాటు 25 మందిని నియమించే అవకాశం ఉన్నా తొలుత 24 మందిని మాత్రమే కేబినెట్ మంత్రులుగా తీసుకున్నారు. వారిలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా ఉన్నారు.

నారా చంద్రబాబు నాయుడు

చిత్తూరు జిల్లా కుప్పం నుంచి గెలిచిన నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పటి వరకూ ఎనిమిదిసార్లు అదే నియోజకవర్గం నుండి గెలుస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కుమార్తె భువనేశ్వరిని వివాహం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం హెరిటేజ్ కంపెనీ యజమానిగా ఉన్నారు.

1. కొణిదెల పవన్‌కల్యాణ్ (జనసేన)

అగ్రనటుడు చిరంజీవి సోదరుడిగా సినిమాల్లోకి వచ్చి అనంతరం రాజకీయ పార్టీ స్థాపించిన పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నుండి విజయం సాధించారు. ఇంటర్మీడియట్‌తో విద్యను ఆపేసిన ఆయన 1996లో సినిమాల్లోకి వచ్చారు. 2008లో ప్రజారాజ్యం పార్టీలో ఏర్పాటైన యువరాజ్యం అధ్యక్షులుగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2014లో జనసేన పార్టీని స్థాపించారు. 2019 ఎన్నికల్లో భీమవరం, గాజువాకలో పోటీచేసి రెండుచోట్లా ఓడిపోయారు. 2024లో ఎన్‌డిఎ కూటమిలో కలిశారు. పార్టీ తరపున 21 మంది ఎమ్మెల్యేలను, ఇద్దరు ఎంపిలను గెలిపించుకున్నారు.

2. నారా లోకేష్ (టిడిపి)

ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తనయుడు లోకేష్ గుంటూరు జిల్లా మంగళగిరి నుండి భారీ మెజార్టీతో విజయం సాధించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో నుండి ఎంబిఎ చదివారు. 2017లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఎన్నికై ఐటి, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పనిచేశారు. 2019లో మంగళగిరి నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2024లో అదే నియోజకవర్గం నుండి పోటీచేసి 91 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు.

3. కింజరాపు అచ్చెన్నాయుడు (టిడిపి)

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుండి గెలిచిన కింజరాపు అచ్చెన్నాయుడు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. సోదరుడు కింజరాపు ఎర్రన్నాయుడు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1995, 1999, 2004లో హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుండి గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో టెక్కలి నుండి పోటీచేసి ఓడిపోయారు. 2014లో గెలిచి మంత్రిగా పనిచేశారు. 2019లో ఆరోసారి గెలుపొందారు. శాసనసభాపక్ష ఉపనేతగా వ్యవహరించారు. 2021 నుండి పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి గెలుపొంది మంత్రిగా నియమితులయ్యారు.

4. కొల్లు రవీంద్ర (టిడిపి)

మాజీ మంత్రి నడకుదిటి నరసింహా రావు వారసుడిగా కృష్ణా జిల్లా మచిలీపట్నం నుండి 2005లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. పార్టీ డివిజన్ అధ్యక్షులుగా, తెలుగుయువత జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2014లో గెలిచి మంత్రిగా పనిచేశారు. కొల్లు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన బిఎ ఎల్‌ఎల్‌బి విద్యను అభ్యసించారు.

5. నాదెండ్ల మనోహర్ (జనసేన)

గుంటూరు జిల్లా తెనాలి నుండి గెలుపొందిన జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ మాజీ ముఖ్యమంత్రి ఎన్.భాస్కరరావు తనయుడు. 2004లో తెనాలి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో రెండోసారి విజయం సాధించి 2011లో స్పీకరుగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2018లో జనసేనలో చేరారు.

6. పొంగూరు నారాయణ(టిడిపి)

నెల్లూరు జిల్లా నెల్లూరు అర్బన్ నియోజకవర్గం నుండి గెలు పొందిన పొంగూరు నారాయణ ఎమ్మెల్సీ పిహెచ్‌డి చేశారు. స్టాటిస్టిక్స్‌లో బంగారు పథకం సాధించారు. 1979లో నారాయణ పేరుతో ట్యూషన్ ప్రారంభించారు. ప్రస్తుతం 14 రాష్ట్రాల్లో నారాయణ విద్యా సంస్థలు ఉన్నాయి. 1998లో చంద్రబాబుతో పరిచయం అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరారు. తొలుత టిడిపి ఎన్నికల సర్వే విభాగంలో ఉన్నారు. 2014లో ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా పనిచేశారు.

7. వంగలపూడి అనిత (టిడిపి)

విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నుండి గెలుపొందిన వంగల పూడి అనిత ఎంఎ, ఎంఇడి చేశారు. విశాఖ జిల్లా రాజవరంలో పనిచేస్తూనే రాజకీయాల్లోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందారు. 2019లో ఓటమిపాలయ్యారు. 2024లో మరలా గెలిచి మంత్రి అయ్యారు. ప్రస్తుతం తెలుగుదేశం పొలిట్‌బ్యూరో షభ్యులుగానూ, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులుగానూ ఉన్నారు.

8. సత్యకుమార్ యాదవ్ (బిజెపి)

అనంతపురం జిల్లా ధర్మవరం నుండి గెలుపొందిన సత్య కుమార్ యాదవ్ విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో ఉన్నారు. మదనపల్లిలో ఎబివిపిలో పనిచేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. 2018లో బిజెపి జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రసుత్తం బిజెపి ఉత్తరప్రదేశ్ పార్టీ వ్యవహారాల సహ ఇన్‌ఛార్జిగా, అండమాన్ నికోబార్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. 2024 ఎన్నికల్లో గెలిచి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

9. నిమ్మల రామానాయుడు (టిడిపి)

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుండి గెలుపొందిన నిమ్మల రామానాయుడు ఎంఎ పిహెచ్‌డి చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో వైసిపి హవాలోనూ పాలకొల్లులో విజయం సాధించారు. శాసనసభాపక్ష ఉపనేతగా వ్యవహరించారు. 2024లో మరోసారి గెలిచి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

10. ఎన్‌ఎండి ఫరూఖ్ (టిడిపి)

నంద్యాల జిల్లా నంద్యాల నుండి గెలుపొందిన ఎన్‌ఎండి ఫరూఖ్ 1981లో నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ జీవితం ప్రారంభించారు. 1985లో నంద్యాల ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రయ్యారు. చక్కెర పరిశ్రమశాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో డిప్యూటీ స్పీకరుగా పనిచేశారు. 1999లో మూడోసారి గెలుపొంది మున్సిపల్‌శాఖ, వైద్యవిద్యశాఖ, ఉర్దూ అకాడమీ మంత్రిగా పనిచేశారు. 2017లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. 2017-18 మధ్య శాసనమండలి ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 2017-18 మధ్య ఆరోగ్య, మైనార్టీశాఖల మంత్రిగా పనిచేశారు.

11. ఆనం రామ్‌నారాయణరెడ్డి (టిడిపి)

నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుండి గెలుపొందిన ఆనం రామ్‌నారాయణరెడ్డి 1983లో తొలిసారి నెల్లూరు నుండి టిడిపి అభ్యర్థిగా కెవిఎస్ రెడ్డిపై గెలుపొందారు. 1984లో క్రీడామండలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 1985లో అసెంబ్లీ ఎన్నికల్లో రాపూరు నుండి గెలుపొంది ఆర్‌అండ్‌బి మంత్రిగా చేశారు. 1989లో ఓడిపోయారు. 1990లో వ్యాయామ ఉపాధ్యాయ గౌరవ అధ్యక్షులుగా వ్యవహరించారు. 1991లో కాంగ్రెస్ పార్టీలో చేరి 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సమాచార, పర్యాటకశాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో ఆత్మకూరు నుండి గెలిచి మున్సిపల్ మంత్రిగా పనిచేశారు. 2014లో ఆత్మకూరు నుండి ఓడిపోయారు. 2019లో వెంకటగిరి నుండి గెలిచారు. రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య ముఖ్యమంత్రిగా ఉండగా మంత్రిగా పనిచేశారు. 2024లో ఆత్మకూరు నుండి గెలిచి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

12. పయ్యావుల కేశవ్ (టిడిపి)

30 ఏళ్ల నుండి రాజకీయాల్లో ఉన్నారు. 1994లో ఉరవకొండ నుండి విజయం సాధించారు. 2004, 2009, 2019లోనూ గెలిచారు. 2015 నుండి 2019 వరకూ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా పనిచేశారు. రాయలసీమలో చంద్రబాబు, బాలకృష్ణ ఇద్దరితోపాటు గెలిచిన మూడో వ్యక్తి. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో తొలిసారి కేబినెట్లోకి వచ్చారు.

13. అనగాని సత్యప్రసాద్ (టిడిపి)

బాపట్ల జిల్లా రేపల్లె నుండి గెలిచిన అనగాని సత్యప్రసాద్ డిగ్రీ వరకూ చదువుకున్నారు. 2009లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. రేపల్లె నుండి పోటీచేసి ఓడిపోయారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

14. కొలుసు పార్థసారథి (టిడిపి)

ఏలూరు జిల్లా నూజివీడు నుండి గెలుపొందిన కొలుసు పార్థసారథి బిటెక్ వరకూ చదివారు. తండ్రి కొలుసు పెద రెడ్డయ్య రెండు సార్లు మచిలీపట్నం ఎంపిగా గెలుపొందారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2004లో ఉయ్యూరు, 2009, 2019లో పెనమలూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2024లో నూజివీడు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009 నుండి 2010 వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పశుసంవర్ధకశాఖ మంత్రిగా, 2010 నుండి 2014 వరకు విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించారు.

15. డోల బాలవీరాంజనేయస్వామి (టిడిపి)

ప్రకాశం జిల్లా కొండెపి నుండి విజయం సాధించిన డాక్టర్ డోల బాలవీరాంజనేయస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేశారు. దామచర్ల ఆంజనేయులు కుటుంబ సభ్యులు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందారు. టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా పనిచేశారు. 2019 నుండి 2024 వరకూ టిడిపి విప్‌గానూ వ్యవహరించారు. మూడోసారి గెలిచి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

16. గొట్టిపాటి రవికుమార్ (టిడిపి)

ప్రకాశం జిల్లా అద్దంకి నుండి గెలిచిన గొట్టిపాటి రవికుమార్ ఇంజనీరింగ్ చదివారు. గ్రానైట్ వ్యాపారి. 2004లో మార్టూరు నుండి కాంగ్రెస్ తరపున గెలిచారు. 2009, 2014లో వైసిపి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లోనూ గెలుపొందారు. ప్రస్తుతం చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యులయ్యారు.

17. కందుల దుర్గేష్ (జనసేన)

నిడదవోలు నుండి గెలుపొందిన కందుల దుర్గేష్ ఎంఎ ఎకనామిక్స్ చదివారు. 2007-2013 వరకూ కాంగ్రెస్ ఎమ్మెల్సీగా పనిచేశారు. 2014లో రాజమహేంద్రవరం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2018లో జనసేనలో చేరారు. 2019 ఎన్నికల్లో రాజమహేంద్రరం రూరల్ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019-24 వరకూ జనసేన పార్టీ రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌ఛార్జిగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా సేవలందించారు. 2024 ఎన్నికల్లో నిడదవోలు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. బాబు కేబినెట్‌లో స్థానం సంపాదించారు.

18. గుమ్మడి సంధ్యారాణి (టిడిపి)

పార్వతీ పురం మన్యం జిల్లా సాలూరు నుండి గెలిచిన గుమ్మడి సంధ్యారాణి బిఎస్‌సి విద్యను అభ్యసించి ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. 25 ఏళ్లకే రాజకీయాల్లోకి వచ్చారు. 1999లో కాంగ్రెస్ తరపున సాలూరు నుండి పోటీచేసి ఓడిపోయారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరారు. 2009 అసెంబ్లీ, 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 2015లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులుగా నియమితులయ్యారు. 2024 గెలుపుతో మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

19. బిసి జనార్ధన్‌రెడ్డి (టిడిపి)

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజ కవర్గం నుండి గెలుపొందిన బిసి జనార్ధన రెడ్డి 8వ తరగతి వరకూ చదువుకున్నారు. 2014లో బనగానపల్లె నుండి గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో గెలిచి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

20. టిజి భరత్ (టిడిపి)

కర్నూలు జిల్లా కర్నూలు నుంచి గెలుపొందిన టిజి భరత్ యుకెలో ఎంబిఎ చదువుకున్నారు. తండ్రి టిజి వెంకటేష్ వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2019లో కర్నూలు నుండి పోటీచేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో గెలుపొంది మంత్రి అయ్యారు.

21. ఎస్ సవిత (టిడిపి)

సత్యసాయి జిల్లా పెనుగొండ నుండి గెలుపొందిన ఎస్ సవిత తండ్రి రామచంద్రారెడ్డి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ఎంపిగా, మంత్రిగా పనిచేశారు. సవిత 2017-19 వరకూ కురుబ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నారు. 2024 ఎన్నికల్లో గెలుపొంది మంత్రయ్యారు.

22. వాసంశెట్టి సుభాష్ (టిడిపి)

రామచంద్రాపురం నుండి గెలుపొందిన వాసంశెట్టి సుభాష్ న్యాయ విద్యను అభ్యసించారు. తాత సత్తిరాజు, తండ్రి సత్యం అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్లుగా పనిచేశారు. తల్లి కృష్ణకుమారి ప్రస్తుతం అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నారు. 2019 నుంచి వైసిపి యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం టిడిపిలో చేరారు. 2024 ఎన్నికల్లో రామచంద్రాపురం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి మొదటి ప్రయత్నంలోనే గెలిచారు.

23. కొండపల్లి శ్రీనివాస్ (టిడిపి)

విజయనగరం జిల్లా గజపతినగరం నుండి గెలుపొందిన కొండపల్లి శ్రీనివాస్ ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ విద్యను అభ్యసించారు. శ్రీనివాస్ తాత కొండపల్లి పైడితల్లి నాయుడు మూడుసార్లు బొబ్బిలి ఎంపిగా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ అధ్యక్షులుగా, జిల్లా పార్టీ అధ్యక్షులుగా కూడా సేవలు అందించారు. తండ్రి కొండపల్లి కొండలరావు గంట్యాడ మండలం ఎంపిపిగా పనిచేశారు. అతని చిన్నాన్న కొండపల్లి అప్పలనాయుడు 2014లో గజపతినగరం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024 ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసిన శ్రీనివాస్ ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి పదవి దక్కించుకున్నారు.

24. మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి (టిడిపి)

రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి బిడిఎస్ విద్యను అభ్యసించారు. తండ్రి మండిపల్లి నాగిరెడ్డి 1985, 1989లో రాయచోటి ఎమ్మెల్యేగా పనిచేశారు. సోదరుడు నారాయణరెడ్డి 1993, 1994లో ఎమ్మెల్యేగా పనిచేశారు. తల్లి సుశీలమ్మ చిన్నమండెం ఎంపిపిగా పనిచేశారు. సోదరి శ్రీలతరెడ్డి 2004లో రాయచోటి నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. రామ్‌ప్రసాద్‌రెడ్డి 2012 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున, 2014లో సమైక్యాంధ్ర పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2019లో వైసిపిలో చేరారు. అక్కడ సముచిత స్థానం ఇవ్వకపోవడంతో 2021లో టిడిపిలో చేరారు.

కక్షపూరిత ధోరణిని ప్రజలు హర్షించరు : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తే ప్రజలు సహించరని, నిశ్శబ్ద ఓటుతో ఎన్నికల్లో ప్రజలు తీర్పునిచ్చారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం రాజధాని అమరావతి, పోలవరంను నిర్వీర్యం చేసిందన్నారు. బుధవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, బండి సంజయ్‌ను సన్మానించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

అమరావతి, పోలవరానికి ప్రాధాన్యత

- నేడు సిఎం హోదాలో చంద్రబాబు తొలిసారి చర్చించే అవకాశం
- ఒకట్రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బదిలీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోనున్నట్లు తెలిసింది. ఇప్పటికే అమరావతే రాజధానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిఎం హోదాలో గురువారం సాయంత్రం తొలిసారి హామీలపై సంతకాలు చేసిన అనంతరం అమరావతి, పోలవరం ప్రాజెక్టుల అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది. వీటికి సంబంధించిన ఫైళ్లను ఇప్పటికే ప్రభుత్వం సిద్ధం చేసింది. వీటితోపాటు మొత్తం జలవనరులశాఖపైనా సమీక్షించనున్నట్లు తెలిసింది. తొలిరోజు అభినందనలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో వీలైనంత తగ్గించి శాఖలపై సమీక్షించాలని నిర్ణయించారని సమాచారం. తిరుపతి నుండి నేరుగా ఉండవల్లి చేరుకుని అక్కడ నుండి సచివాలయంలో తన ఛాంబర్‌కు సిఎం చేరుకోనున్నారు. దీనికోసం మొదటి బ్లాకులో మొత్తం ఫర్నీచర్‌ను మార్చేశారు. గతంలో వినియోగించిన మైకులనూ మార్చి కొత్తవాటిని ఏర్పాటు చేశారు. అనంతరమే కీలకమైన అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు. పట్టణాభివృద్ధి శాఖ, రెవెన్యూ కూడా ఉండటంతో వాటికి సంబంధించిన వివరాలనూ అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికే సిసిఎల్‌ఎ నుండి సమగ్ర సమాచారాన్ని సిఎస్‌కు పంపారు. ఇందులో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు అంశమే కీలకంగా ఉందని సమాచారం.

పట్టణాభివృద్ధిశాఖలో చెత్తపన్ను అంశం కూడా ముఖ్యమైనదే కావడంతో దానిపైనా ఒకట్రెండు రోజుల్లో తగు నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా దాదాపు 24 మంది ఐఎఎస్ అధికారుల బదిలీలు కానున్నాయి. దీనిపై సిఎస్ కూడా కసరత్తు పూర్తి చేశారు. రెండోదశలో కలెక్టర్లు, మూడోదశలో ఎస్‌పిలను బదిలీ చేయనున్నారు. ఇవన్నీ ఒకట్రెండు రోజుల్లోనే జరిగిపోనున్నాయని తెలిసింది. మైనింగ్ అంశంపై అత్యవసర విచారణకూ ఆదేశించే అవకాశం ఉంది. గత ఐదేళ్ల పాలనకు సంబంధించి డిపార్టుమెంట్ల వారీ వివరాలతో కూడిన నివేదికలు తయారుచేయనున్నారు. దీనిపై ఇప్పటికే అన్ని శాఖలకూ సిఎస్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా మైనింగు, ఎక్సైజ్, విద్యాశాఖ, పట్టణాభివృద్ధి, విద్యుత్, ఆర్థికశాఖలపై తొలిదశలో నివేదికలు వెల్లడించే అవకాశం ఉంది.

సైడ్ లైట్స్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు గన్నవరం మండలం కేసరపల్లి సభా ప్రాంగణం వద్దకు తరలివచ్చాయి.

- పాస్‌లు లేని వాహనాలను లేకపోవడంతో సుదూర ప్రాంతాల్లో నిలిపివేశారు. 10 నుంచి 12 కిలోమీటర్ల మేర నడుచుకుంటూనే సభా ప్రాంగణానికి అభిమానులు చేరుకున్నారు. వాహన పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటు చేసి స్క్రీన్లవద్దే మరికొందరు ఆగిపోయారు. మంచినీళ్ల దొరక్క ఇబ్బందులు పడ్డారు.
- పొట్టిపాడు వద్ద పోలీసులతో ఘర్షణపడి బారికేడ్లను తోసేశారు. వివిఐపిల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ప్రమాణ స్వీకారం అనంతరం వాహనాలు ప్రధాన రహదారికి చేరుకోవడానికి గంటల కొద్దీ సమయం వేచి చూడాల్సి వచ్చింది.
- 11.27 గంటలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రకటించారు. 11.30 గంటలకు మోడీతోపాటుగా వేదికపైకి చంద్రబాబు వచ్చారు. 11.32 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులందరూ దైవసాక్షిగా, ఎన్‌ఎండి ఫరూక్ మాత్రం అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే మంత్రులంతా ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ముఖ్య నాయకుల ఆశీస్సులు తీసుకున్నారు.
- పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేసే సమయంలో పవర్ స్టార్.. పవర్ స్టార్ అంటూ జనసేన కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు. ప్రమాణ స్వీకారం పూర్తయ్యాక వేదికపై ఉన్న ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా తదితరుల ఆశీస్సులు తీసుకున్నారు. చిరంజీవికి పాదాభివందనం చేశారు.

ప్రమాణస్వీకారోత్సవ వేదికపై సోదరి భువనేశ్వరిని ఆశీర్వదిస్తున్న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

వైసిపి శ్రేణులపై టిడిపి దాడులు

- రాష్ట్రపతికి, ఎన్‌హెచ్‌ఆర్‌సి, ప్రధాని, కేంద్ర హోం మంత్రికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో వైసిపి శ్రేణులు లక్ష్యంగా టిడిపి దాడులు చేస్తుందని ఆ పార్టీ ఎంపిలు విమర్శించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హచ్‌ఆర్‌సి), ప్రధానమంత్రి, కేంద్ర హం మంత్రికి వైసిపి ఫిర్యాదు చేస్తూ లేఖలు రాసింది. ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా టిడిపి, జనసేనలు వైసిపి కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ సందర్భంగా వైసిపి ఎంపిలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, బీదా మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, కానీ గత కొన్ని రోజులుగా జరుగుతున్న హింసాత్మక ఘటనలు చాలా బాధాకరమని అన్నారు. వైసిపి కార్యకర్తల పైన దాడులు చేయడం, ఇళ్లు కూలగొట్టడం లాంటి పరిస్థితులు రాష్ట్రంలో ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి, కేంద్ర హెూం మంత్రి, జాతీయ మానవ హక్కుల కమిషన్ కు లేఖలు రాశామన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజు రోజుకూ క్షీణిస్తున్నాయని, వాటిని పరిరక్షించాలని రాష్ట్రపతిని కోరినట్లు తెలిపారు. ఏపిలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. గత వారం రోజులుగా టిడిపి, జనసేన శ్రేణులు దాడులకు తెగబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో అన్యాయం రాజ్యమేలుతోందని ఆరోపించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

- సిహెచ్.నర్సింగరావు డిమాండ్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తున్నట్టు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, రాష్ట్రం నుంచి కేంద్ర ఉక్కు సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బి.శ్రీనివాస్‌వర్మ ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. ఉక్కు నగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రయివేటీకరణ నిలుపుదల చేస్తున్నట్టు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్మికుల సుదీర్ఘ పోరాట ఫలితమే ఆ నిర్ణయమని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం జరుగుతోందని, దీనిపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి, ఉక్కు సహాయ మంత్రి స్పందించాలని కోరారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాలని, పూర్తిస్థాయి ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని కోరారు. స్టీల్ యాజమాన్యం సకాలంలో కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యాక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి తదితరులు ప్రసంగించారు.

రాజధాని అమరావతిలో సంబరాలు

- తుళ్లూరులో రైతు దీక్షా శిబిరంలో మహిళా రైతుల నృత్యాలు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం సందర్భంగా బుధవారం రాజధాని తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రైతులు, ప్రధానంగా మహిళలు జై చంద్రబాబు అంటూ నృత్యాలు చేశారు. రైతులు, మహిళలు ఆకుపచ్చని కండువాలు చేతితో తిప్పుతూ, పసుపు జల్లుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. రాజధాని అమరావతి అంశం జీవన్మరణ సమస్యగా ఉన్న ఈ సమయంలో ఎన్నికల ఫలితాలు ఏ విధంగా ఉంటాయోనన్న ఆందోళనతో సతమతమైన రైతులకు కూటమి గెలుపు అంతులేని సంతోషాన్నిచ్చింది. రాజధానిలో అభివద్ధి పనులు మొదలు కావడం, రాష్ట్ర రాజధాని అమరావతేనని సిఎం చంద్రబాబు మంగళవారం స్పష్టంగా ప్రకటన చేయడం, మరుసటి రోజు ప్రమాణ స్వీకారం చేయడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. యువకులతో పాటు వృద్ధులు సైతం సంబరాలలో పాల్గొన్నారు. రాజధానిలోని రైతు దీక్షా శిబిరాలలో బుల్లి తెర ఏర్పాటు చేసుకొని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు.

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు రైతు దీక్షా శిబిరం వద్ద నృత్యాలు చేస్తున్న మహిళా రైతులు

తిరుమలకు చంద్రబాబు కుటుంబం

- నేడు శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి- తిరుమల

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం నారా చంద్రబాబునాయుడు కుటుంబంతో సహా తిరుమల శ్రీవారిని దర్శనానికి బుధవారం రాత్రి విచ్చేశారు. భార్య భువనేశ్వరి, కొడుకు నారా లోకేష్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్‌తోపాటు నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు వీరితోపాటు ఉన్నారు. టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి సెలవులో ఉన్నందున టిటిడి జెఇఒ వీరబ్రహ్మం వీరికి తిరుమలలో ఘనస్వాగతం పలికారు. గాయత్రి నిలయంలో చంద్రబాబు కుటుంబం రాత్రి బస చేసింది. గురువారం ఉదయం 7.15 గంటలకు కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకోనుంది. అనంతరం తిరిగి రాజధాని అమరావతికి చంద్రబాబు చేరుకుంటారు.

సిపిఐ (ఎంఎల్) నాయకులు రాధక్క కన్నుమూత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పటల్

సిపిఐ (ఎంఎల్) ప్రతిఘటన కేంద్ర కమిటీ సభ్యురాలు రాధక్క (86) ఈ నెల 11న హైదరాబాదులో ఆమె స్వగృహంలో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. సిపిఐ (ఎంఎల్) ఉమ్మడి రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఆనంద్ ఒక ప్రకటనలో ఆమె మృతికి సంతాపాన్ని ప్రకటించారు. రాధక్క మరణం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. రాధక్క కాకినాడ పాలిటెక్నిక్ కళాశాలలో చదివే క్రమంలో నాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి విభాగంలో చురుగ్గా పాల్గొనే వారని, 1969లో పార్టీలో సిద్ధాంత విభాగాల నేపథ్యంలో సిపిఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలో అడవి ఉద్యమంలో ఆయన అనుచరులుగా పాల్గొన్నారని తెలిపారు. కాలక్రమంలో వారిరువు జీవితంలోనూ భాగస్వాములు అయ్యారని వివరించారు. గురువారం రాధక్క అంత్యక్రియలు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

చిరంజీవి,పవన్‌తో కలిసి అభివాదం చేస్తున్న ప్రధాని మోడి

మెగా బ్రదర్స్‌తో ప్రధాని

- హోరెత్తిన సభా ప్రాంగణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఒకవైపు పద్మవిభూషన్ చిరంజీవి, మరోవైపు పవన్‌కల్యాణ్ మధ్యలో ప్రధాని మోడీ నిలబడి ప్రజలకు అభివాదం చేశారు. దీంతో సభా ప్రాంగణమంతా మెగాస్టార్.. పవర్‌స్టార్.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని మోడీ.. తమిళ్ సూపర్‌స్టార్ రజినీకాంత్, నందమూరి బాలకృష్ణతో కరచాలనం చేశారు.

జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

విజయవాడలో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-గన్నవరం, విజయవాడ

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని చూసేందుకు వేలాది మంది ప్రజలు కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లికి తరలివచ్చారు. దారులన్నీ విజయవాడ వైపే అన్నట్లుగా వచ్చిన వేలాది వాహనాలతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. లెక్కకు మించి వచ్చిన వాహనాలతో కేసరపల్లి నుంచి విజయవాడ వారధి వరకు 25 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ప్రకాశం, గుంటూరు, ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ నుంచి అంచనాకు మించి టిడిపి నాయకులు, కార్యకర్తలు కేసరపల్లికి తరలి వచ్చారు. దీంతో, విజయవాడ నగరం పూర్తిగా స్తంభించిపోయింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచే నగరంలో ట్రాఫిక్ ప్రభావం కనిపించింది. ప్రధానంగా బెంజ్ సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, మహాత్మాగాంధీ రోడ్డు (ఎంజి రోడ్డు), కారల్ మార్క్స్ రోడ్డు (ఏలూరు రోడ్డు), విజయవాడ కనకదుర్గ వారధి నుంచి రామవరప్పాడు వరకు హైవేపై, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ పైన, దిగువన ప్రధాన రహదారులపై వాహనాలు నిలిచిపోయాయి. విజయవాడ రూరల్ నుంచి గన్నవరం వరకు కూడా ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల పొడవున వేలాది వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ నుంచి బందర్ వైపు వెళ్లే రహదారిపై కూడా వాహనాలు ఆగిపోయాయి. విజయవాడ - కలకత్తా, విజయవాడ - మద్రాస్, విజయవాడ - హైదరాబాద్ రూట్లలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలకు, ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది.

ప్రమాణస్వీకారోత్సవ వేదికపై ఆశీనులైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సిజెఐ ఎన్‌వి రమణ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, గడ్కరీ, రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తదితరులు

తరలి వచ్చిన అతిరథ మహారథులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అతిరథ మహారథులు తరలివచ్చారు. విజయవాడ సమీపంలోని కేసరపల్లి ఐటి సెజ్ వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు పారిశ్రామికవేత్తలు, సినీనటులు, విదేశీ ప్రతినిథులు, చంద్రబాబు కుటుంబ సభ్యులతో పాటు టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఉదయం 10:55కు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి చంద్రబాబు, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, కృష్ణా జిల్లా కలెక్టరు డికె బాలాజి ఘనస్వాగతం పలికారు. గన్నవరం విమానాశ్రయం నుండి ప్రమాణస్వీకార వేదిక అయిన కేసరపల్లిలోని ఐటిపార్క్‌కు మోడీ, చంద్రబాబు కలిసి వచ్చారు. అలాగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, బిజెపి జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి జెపి నడ్డా, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాందాస్ అథవాలే, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, చిరాగ్ పాశ్వాన్, అనుప్రియా పటేల్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వి రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్ తమిళిసై హాజరయ్యారు. సినీనటులు చిరంజీవి, రజినీకాంత్ సతీసమేతంగా హాజరయ్యారు. అలాగే రామ్‌చరణ్, శివాజీ, నారా రోహిత్, బోయపాటి శ్రీనివాస్, నిఖిల్, నిర్మాతలు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నాగవంశీ, పారిశ్రామివేత్తలు గౌతం అదానీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి, నందమూరి రామకృష్ణ, నందమూరి సుహాసిని, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, సింగపూర్, ఆస్ట్రేలియా, కొరియా, జపాన్, బ్రిటన్, ఫ్రాన్స్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, అమెరికా, ఇరాన్, శ్రీలంక దేశాల ప్రతినిథులు హాజరయ్యారు. గత ఐదేళ్ల కాలంలో పోలీసు కేసులు, అధికార పార్టీ వేధింపులతో తీవ్ర ఇబ్బందులకు గురైన బాధితులను కూడా ప్రమాణస్వీకారానికి ఆహ్వానించారు. చంద్రబాబు, మంత్రుల ప్రమాణస్వీకారం అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ, గవర్నరు అబ్దుల్ నజీర్‌తో కలిసి అందరూ గ్రూప్ ఫొటో తీసుకున్నారు.

చంద్రబాబుకు షర్మిల శుభాకాంక్షలు

- ప్రజారంజక పాలన అందించాలని ఆకాంక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల శుభాకాంక్షలు తెలియజేశారు. చారిత్రాత్మకమైన మెజారిటీతో మిమ్మల్ని (టిడిపి కూటమి)ని అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజల ఆశయాలకు, నమ్మకాలకు అనుగుణంగా, రాష్ట్ర అవసరాలను, కఠిన సవాళ్లను దృష్టిలో పెట్టుకుని, సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతలను మిళితం చేసి ఇకపై ప్రజారంజక పాలన అందిస్తారని ఆశిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. 'గడిచిన ఐదేళ్లలో జరిగిన విశృంఖల పాలన, దాని వల్ల అన్ని విధాలుగా నాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలోపెట్టి ముందుకు తీసుకెళతారని ప్రజలు మీకు ఈ తీర్పు ఇచ్చారు. దానికనుగుణంగా నడుచుకుని, వైఎస్సార్ విగ్రహాలపై దాడులు, ప్రతిపక్షాలపై ప్రతీకార చర్యలు ఇకపై జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము' అని షర్మిల పేర్కొన్నారు. కాగా, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్రాభివృద్ధిలో, ప్రజారంజక సర్కారు పాలన చూడటంలో ప్రత్యేక పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

సుమారు రూ. 83.40 లక్షల విలువ గల 10 పనులకు షార్ట్ నిట్ నెం. ఇఇ/ఆర్ అండ్ బి/జిఎన్‌టి/1 నుండి 10/2024-25, తేది: 07.06.2024 ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. తదుపరి వివరములకు ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేదీ: 18.06.2024, సా.3.30గం.ల వరకు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు
(ర.భ) డివిజను, గుంటూరు

DIPRNo:13531/CL/ADVT/1/1/2021-22

రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ప్రధాని నరేంద్ర మోడీ
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందనల వెల్లువ
- రాజకీయ, సినీ ప్రముఖుల ట్వీట్స్..

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌ను నూతన కీర్తిశిఖరాలకు తీసుకెళ్లటానికి, రాష్ట్ర యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి ఎన్‌డిఎ (తెలుగుదేశం, జనసేన, బిజెపి) ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఈ కార్యక్రమాన్ని 'వెరీ స్పెషల్'గా అభివర్ణించారు. భారీ బహిరంగ సభలో ప్రసంగించనప్పటికీ, ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యాను. ముఖ్యమంత్రి అయిన సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు గారికి, మంత్రులుగా ప్రమాణం చేసిన వారందరికీ కూడా అభినందనలు' అని ట్వీట్ చేశారు. కాగా ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీని సిఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఎపి అన్ని రంగాల్లో దూసుకుపోతుంది

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే మంత్రిగా ప్రమాణం చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాన్‌కు కూడా ఆయన అభినందనలు తెలియజేశారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి అభినందనలు తెలియజేశారు. 'ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని విశ్వసిస్తున్నాను' అని ఆయన ట్వీట్ చేశారు. అలాగే కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, కేంద్ర మంత్రి కుమారస్వామి, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రవిశంకర్ ప్రసాద్, తమిళనాడు బిజెపి అధ్యక్షులు కె అన్నమలై, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర, హీరోలు నారా రోహిత్, సాయిధరమ్ తేజ్, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సిఎం చంద్రబాబుకు ఎక్స్ ద్వారా అభినందనలు తెలియజేశారు.



షావోమి 14సివి స్మార్ట్‌ఫోన్ విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ షావోమి బుధవారం భారత మార్కెట్లోకి తన 14సివి మోడల్‌ను విడుదల చేసింది. సినిమాటిక్ విజన్ కలిగిన లీక కెమెరాతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ తెలిపింది. 8జిబి, 256జిబి వేరియంట్ ధరను రూ.39,999గా ప్రకటించింది. లైకా ట్రిపుల్ రేర్ కెమెరాలో 50 ఎంపి కెమెరా సహా సెల్ఫీ కోసం రెండు 32 ఎంపి కెమెరాలను ఆమర్చింది. ఈ ఫోన్‌ను మార్చిలో చైనాలో ఆవిష్కరించింది.

ఎపి అభివృద్ధికి కృషి

- కేంద్ర ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని లోక్ జనశక్తి (రామ్ విలాస్) పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన మంగళగిరిలోని లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు మంచి అనుబంధం ఉందన్నారు. అదే బాటను తాను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. పవన్ కల్యాణ్ తనకు మంచి మిత్రుడని తెలిపారు. కూటమికి అభినందనలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. క్యాబినెట్ మంత్రిగా తొలిసారిగా మంగళగిరి రావటం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చింత వెంకటేశ్వర్లు కేంద్రమంత్రికి ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

పాడేరు ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

- వ్యాన్ బోల్తా పడి ముగ్గురు దుర్మరణం
- 9 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు 20 కిలోమీటర్ల దూరంలోని ఘాట్ రోడ్డులో మలకపొలం జంక్షన్ సమీపంలో బుధవారం సాయంత్రం వ్యాన్ బోల్తా పడి ముగ్గురు దుర్మరణం చెందారు. తొమ్మిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... పెదబయలు మండల కేంద్రంలో మోదకొండమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలకు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన ఎస్ఎస్‌వి సౌండ్స్ నుంచి డిజె సౌండ్ సిస్టం, స్టేజ్ సామగ్రిని తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం వాటిని తీసుకొస్తుండగా వ్యాన్ అదుపు తప్పి ఘాట్ రోడ్డు సైడ్ వాల్ వద్ద బోల్తా పడింది. అందులోని 12 మంది ప్రయాణికులు స్టేజీ సామగ్రితో సహా తుళ్లి లోయలోకి పడిపోయారు. ఈ ఘటనలో అశోక్ (22) లక్ష్మణ్ (20) హరీష్ (23) మృతి చెందారు. సేనాపతి గణేష్, కంకిపూడి పవన్, భీముని రవి, మోహన్, నితిన్, పేయ్యల భారతి, లంక శ్రీను, చందక రాజు, రోహిత్ కుమార్, సునీత, సూర్య దీక్షిత తీవ్రంగా గాయపడ్డారు. వీరు పాడేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులు, క్షతగాత్రులు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందినవారే. పాడేరు సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ విజయ సునీత సందర్శించి క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

పాడేరు ఆస్పత్రిలో క్షతగాత్రులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో విడుదల చేశారు. గతేడాది కంటే టెట్ ఉత్తీర్ణత పెరిగింది. గతనెల 20 నుంచి ఈనెల రెండో తేదీ వరకు టెట్ రాత పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. టెట్‌కు 2,86,381 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. టెట్ పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేయగా, 85,996 మంది హాజరయ్యారు. వారిలో 57,725 (67.13 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,86,381 మంది దరఖాస్తు చేస్తే, 1,50,491 మంది పరీక్ష రాశారు. వారిలో 51,443 (34.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. గతేడాదితో పోలిస్తే పేపర్-1లో 30.24 శాతం, పేపర్-2లో 18.88 శాతం ఉత్తీర్ణత శాతం పెరిగింది. పేపర్-1ను ఏడు విడతల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ, బెంగాలీ వంటి ఎనిమిది భాషల్లో రాతపరీక్షలను నిర్వహించారు. పేపర్-2ను 13 విడతల్లో ఏడు భాషల్లో నిర్వహించారు. ఈ ఫలితాలను https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

బెంజ్ సర్కిల్ శాఖ,
సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలని,
విజయవాడ-520010. సెల్ నెం. 9326716091.

ఇ. వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం ఆస్తుల అమ్మకపు ప్రకటన, స్థిరాస్తుల అమ్మకమునకు సంబంధించి సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) ప్రకారం.

ఇందు మూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్థిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **బెంజ్ సర్కిల్ శాఖ** కు తనఖా పెట్టినారు, ఈ క్రింద ఉదహరించిన ఆస్తిని అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **బెంజ్ సర్కిల్ శాఖ** వారు స్వాధీనం చేసుకున్నారు, మీరు బ్యాంకుకు బకాయి పడిన సొమ్ము మరియు వడ్డీ, కాంట్రాక్టెడ్ రేటు ప్రకారం ఇతర ఖర్చులతో కూడిన బకాయి చెల్లించనందున అధీకృత అధికారి ఇ-వేలం ద్వారా ఆస్థిని అమ్ముటకు నిర్ణయించడమైనది."ఆస్థి ఎక్కడ ఎలా ఉన్నదో" మరియు "అక్కడ అలానే" అనే పద్దతిలో అమ్మబడును.

ఇ-వేలం తేది. 12-07-2024 | ధరావత్తు చెల్లించు తేదీ:ఈ-వేలం ఆఖరి తేదీ వరకు

1) **ఋణగ్రహీత & హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ పసుమర్తి రాజేష్,** తండ్రి: వెంకట దుర్గ సుబ్రహ్మణ్యం, **2) శ్రీమతి పసుమర్తి సాయి సంగీత,** భర్త: శ్రీ పి. రాజేష్, ఫ్లాట్ నెం.యస్-1, 2వ అంతస్తు, శ్రీ సాయి రెసిడెన్సి, యస్.బి.ఐ రోడ్డు, బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా.
స్థిరాస్థి వివరములు: కృష్ణాజిల్లా-521105, బాపులపాడు మండలం, హనుమాన్ జంక్షన్, యస్.బి.ఐ రోడ్డు, ఆర్.యస్.నెం.185/1ఏ & 186/1ఏ, మొత్తం 639 చ॥గ॥లలో 72 చ॥గ॥ల అవిభాజ్య వాటా, 1149 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 191 చ॥అ॥ల ఉమ్మడి ఏరియా గల శ్రీ సాయి రెసిడెన్సి 2వ అంతస్తులో ఫ్లాట్ నెం.యస్-1 శ్రీ పసుమర్తి రాజేష్ గారికి చెందినది దీనికి హద్దులు: **తూర్పు:** ఓపెన్ టూ స్కై & ఫ్లాట్ నెం.యస్-2, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** ఉమ్మడి కారిడార్ & ఓపెన్ టూ స్కై, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై.
ది. 31-03-2021 నాటికి రూ॥ 19,80,992.36 పై (పంతొమ్మిది లక్షల ఎనభై వేల తొమ్మిది వందల తొంభై రెండు రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే)
రిజర్వు ధర రూ. 15,84,000/- | ధరావత్తు ధర రూ. 1,58,400/-

2) **ఋణగ్రహీత(లు) మరియు తనఖాదారు/హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ యడ్ల శ్రీను (దరఖాస్తుదారుడు),** తండ్రి: వై సత్యనారాయణ, **2) శ్రీమతి యడ్ల రామలింగేశ్వరి (సహ దరఖాస్తుదారు),** భర్త: యడ్ల శ్రీను, 56-6-10/4, మారుతీ కాలనీ, పటమట, విజయవాడ-10. & ఎఫ్.నెం.301, 2వ అంతస్తు, శ్రీ మారుతీ ప్లాజా, కానూరు, విజయవాడ-7. **3) శ్రీ యడ్ల వంశీ సాయి (దరఖాస్తుదారు-విద్యా ఋణం),** తండ్రి: యడ్ల శ్రీను, **4) శ్రీ యడ్ల శ్రీను (సహ-దరఖాస్తుదారు-విద్యా ఋణం),** తండ్రి: వై సత్యనారాయణ, 57-12-6/1, ఎఫ్.నెం.236, 2వ అంతస్తు, ప్రియా చిల్డ్రన్ హాస్పిటల్ దగ్గర, న్యూ పి&టి కాలనీ, పంటకాలువ రోడ్, పటమట, విజయవాడ-10.
స్థిరాస్తి వివరములు: యస్.ఆర్.ఓ పటమట, సేల్ డీడ్ నెం.7750/2012, తేది: 05-11-2012 ప్రకారం పైన పేర్కొన్న షెడ్యూల్-ఏ మొత్తం విస్తీర్ణంలో "శ్రీ మారుతి ప్లాజా" పేరుతో మరియు శైలిలో నిర్మించిన అపార్ట్‌మెంట్ 2వ అంస్తులో ఫ్లాట్ నెం.301, శ్రీ యడ్ల రామలింగేశ్వరి, భర్త: వై.శ్రీను గారికి చెందినది ఈ దిగువ హద్దులలో: **తూర్పు:** ఓపెన్ టూ స్కై, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై (రోడ్డు వైపు). పై నాలుగు సరిహద్దుల మధ్య 746 చ.అ.ల ప్లింత్ ఏరియా, 157 చ.అ.ల కామన్ ఏరియా, & 100 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా మరియు అన్ని సౌలభ్య హక్కులతో.
ది.02-03-2023 నాటికి రూ॥ 26,76,400.67 పై (అక్షరాల ఇరవై ఆరు లక్షల డెబ్బై ఆరు వేల నాలుగు వందల అరవై ఏడు పైసలు మాత్రమే)
రిజర్వు ధర రూ. 22,50,000/- | ధరావత్తు ధర రూ.2,25,000/-

3) **ఋణగ్రహీత(లు) మరియు తనఖాదారు/హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) కొప్పుల హారిక (దరఖాస్తుదారుడు), తండ్రి: వెంకట రత్నం, 2) కొప్పుల వెంకటరత్నం (సహ-దరఖాస్తుదారుడు),** తండ్రి: వెంకటరావు, 1-10-22/బి, యస్ 101, రిషివిల్లా అపార్ట్‌మెంట్స్, నజీర్‌పేట, సత్యసాయి నగర్, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201. **3) రాజపుత్ర మహేంద్ర కార్తీక్ సింగ్ (సహ-దరఖాస్తుదారు/హామీదారు),** తండ్రి: నాగేంద్ర బాబు, ఫ్లాట్ నెం:సి1, 3వ అంతస్తు, శ్రీ పద్మజ టవర్స్, యం.పి దాస్ వీధి, క్రాంబే రోడ్, స్వాతి థియేటర్ పక్కన, భవానీపురం, విజయవాడ-12.
స్థిరాస్తి వివరములు: షెడ్యూల్-ఏ: కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రేషన్ ఆఫీస్, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్, విజయవాడ పరిధి, భవానిపురం, యం.పి.దాస్ వీధి, ఆర్.యస్.నెం.72/2, డి.నెం.76-8/9-12జి, మొత్తం 517 చ.గ.లు లేదా 432.279 చ.మీ.లలో 31.00 చ.గ.లు లేదా 25.92 చ.మీ.ల అవిభాజ్యపు ఉమ్మడి వాటా ఈ దిగువ హద్దులలో **తూర్పు:** పిసిపాటి శ్రీమన్నారాయణ గారి ఆస్తి 55.10 అడుగులు, **దక్షిణం:** 30 అడుగుల వెడల్పు యం.పి దాస్ వీధి, ఏ మున్సిపల్ రోడ్ 82.08 అడుగులు, **పడమర:** క్రాంబే రోడ్, మున్సిపల్ రోడ్ 56.10 అడుగులు, **ఉత్తరం:** యస్.కె అలీ సాహెబ్ గారి ఆస్థి-82.08 అడుగులు. ఈ నాలుగు సరిహద్దుల మధ్య 517 చ.గ.లు లేదా 432.2798 చ.మీ.లలో 31.00 చ.గ.లు లేదా 25.92 చ.మీ.ల ఉమ్మడి అవిభక్త వాటా గల స్థలం. **షెడ్యూల్-బి:** పైన పేర్కొన్న షెడ్యూల్‌లో ఆఫీస్ రూమ్ మరియు స్టోర్ రూమ్‌తో కూడిన ఆర్.సి.సి రూఫ్డ్ అపార్ట్‌మెంట్ "శ్రీ పద్మజ టవర్స్" పేరుతో మరియు శైలిలో నిర్మించబడిన గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ రాజపుత్ర మహేంద్ర కార్తీక్ సింగ్, తండ్రి: నాగేంద్ర బాబు గారికి చెందినది (వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.2604/2007, తేది: 21.03.2007, యస్.ఆర్.ఓ జిల్లా రిజిస్ట్రేషన్ విజయవాడ) ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఎగ్జిక్యూటెంట్ కార్ పార్కింగ్ ఆస్థి మరియు పాత్‌వే స్థలం, **దక్షిణం:** ఈ దుకాణం మరియు కె.ఆర్ లింగప్రసాద్ గారి దుకాణం మధ్య గల ఉమ్మడి గోడ, బి.సునీత మరియు వి.సరస్వతి, **పడమర:** ఎగ్జిక్యూటెంట్ ఆస్తి, **ఉత్తరం:** ఎగ్జిక్యూటెంట్ ఆస్థి మరియు పాత్‌వే స్థలం యొక్క ఆస్తి. పైన పేర్కొన్న నాలుగు సరిహద్దుల మధ్య 271 చ.అ.ల ప్లింత్ ఏరియా, అన్ని సులభ హక్కులతో.
రిజర్వు ధర : రూ. 12,10,000/- (అక్షరాల పన్నెండు లక్షల పది వేల రూపాయలు మాత్రమే)

ఆస్థి అమ్మకం యొక్క నియమ నిభంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ **www.unionbankofindia.co.in** and **www.ibapi.in** నందు చూడగలరు.
అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్థి పరిశీలన కోసం అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు ఫోన్ నెం. 9326716091, బ్రాంచ్ మెయిల్ ఐడి: **ubin0816094@unionbankofindia.bank** నందు చూడగలరు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదిన ఇ-వేలం అమ్మకము నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 10-06-2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

ఉపాధి కల్పన...!

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే దేశం ఎదుర్కొనే అతి పెద్ద సవాల్ అని రాయిటర్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో పాల్గొన్న పలువురు ఆర్థిక వేత్తలు కొద్దిరోజుల క్రితం అభిప్రాయపడ్డారు. ఆ సంస్థ సంప్రదించిన ఆర్థిక నిపుణుల్లో 60 శాతం మంది నిరుద్యోగ రక్కసి దేశాన్ని పీల్చి పిప్పి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 30 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగకపోవడం, ఆరు శాతం మంది పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నాలుగు శాతం మంది పేదరికాన్ని ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. దశాబ్దకాలం పాటు అనుసరించిన ఉపాధి రహిత అభివృద్ధి విధానాల వల్ల నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని, ఫ్యాక్టరీలలో పూర్తికాలం పని ఉండని పరిస్థితి నెలకొందని, దీంతో అభివృద్ధిలో శ్రామిక శక్తి రేటు గణనీయంగా పడిపోతోందని ప్రసిద్ధ ఆర్థికవేత్త కునాల్ కుందు అభిప్రాయపడ్డారు. పనిచేసే వారికి కూడా పాక్షిక ఉద్యోగ-ఉపాధి పరిస్థితులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయని, ఫలితంగా వ్యక్తుల ఆదాయం గణనీయంగా తగ్గుతోందని, దీని ప్రభావం సరుకుల డిమాండ్ మీద పడుతోందని కూడా ఆయన విశ్లేషించారు. ప్రపంచబ్యాంకు మాజీ ఆర్థిక సలహాదారు డాక్టర్ కౌశిక్ బసు ప్రపంచంలోనే అత్యధికంగా భారతదేశంలోని యువతలో నిరుద్యోగం పెరుగుతోందని గత నెలాఖరులో పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) గణాంకాలను ఉదహరిస్తూ ఆయన ట్వీట్ చేశారు. 'నినాదాల వెనుక దాక్కోవడం మానేయాలి. రాజకీయాలను పక్కనపెట్టాలి. తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగ తీవ్రతకు కొన్ని ఉదాహరణలు మాత్రమే! నిజానికి దేశంలో ఉద్యోగ, ఉపాధి వనరులకు కొదవేం లేదు. గత ఏడాది పార్లమెంటుకు ఇచ్చిన రాత పూర్వక సమాధానంలో మార్చి 2021 నాటికి దేశ వ్యాప్తంగా 9.79 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనే ఈ ఖాళీలున్నాయని, ఒక్క రైల్వేలోనే 2.93 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని తెలిపింది. ఇవి కాక, వివిధ రాష్ట్రాల్లో భర్తీ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలూ లక్షల సంఖ్యలోనే ఉన్నాయి. ప్రైవేటు రంగం సృష్టించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ తక్కువేం కాదు. అన్నీ ఉన్నా... అల్లుడి నోట్లో శని అన్నట్లు ఈ దుస్థితి దేనికంటే ప్రభుత్వాలు అనుసరించే విధానాలే కారణమని సమాధానం!

అంతర్జాతీయ పెట్టుబడి, దానికి మిత్రులైన దేశీయ కార్పొరేట్-ద్రవ్య పెట్టుబడి ముఠా విధించే షరతుల కారణంగా రూపొందించుకునే ఈ విధానాల చట్రం నుండి బయటకు రావడం ద్వారా నిరుద్యోగ సమస్యను ఎలా పరిష్కరించవచ్చో ప్రఖ్యాత ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ సోదాహరణంగా వివరించారు. 'ప్రభుత్వ వ్యయాన్ని గణనీయంగా పెంచడం ద్వారా నిరుద్యోగాన్ని తగ్గించాలి. వ్యయానికి కావాల్సిన వనరులను సమకూర్చుకోవడం కోసం సంపద పన్ను, వారసత్వ పన్నును విధించాలి. దీనివల్ల ఉద్యోగాలు పెరగడంతో పాటు, సమాజంలో అసమానతలను తగ్గించవచ్చు' అని ఆయన వివరించారు. విద్య, వైద్య రంగాల్లో ఉన్న ఖాళీలను ముందు భర్తీ చేయాలని, ఈ రంగాల్లో అదనపు పోస్టులను మంజూరు చేయాలని ఆయన సూచించారు. ఈ చర్యలతో పాటు ఉపాధి హామీ చట్టం కింద పనులను పరిమితులు ఎత్తివేయాలని, గ్రామాల్లో అడిగిన వారందరికీ పని చూపించాలని, పట్టణాల్లో కూడా దాన్ని అమలు చేయాలని సూచించారు. తద్వారా వినిమయ సరకులకు డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, అదనపు ఉత్పత్తి కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సి వస్తుందని, ఇది మళ్లీ ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపునకు దారీ తీస్తుందని ప్రభాత్ పట్నాయక్ వివరించారు. ఆయనే కాదు, 2030 నాటికి ప్రైవేటు రంగంలో 10 కోట్ల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని 'పిహెచ్‌డి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ' తాజాగా ప్రభుత్వానికి సూచించింది. పార్లమెంటులో బిజెపి బలం గణనీయంగా తగ్గడం వెనుక నిరుద్యోగుల ఆగ్రహం కూడా ఒక కారణం. పాలక పెద్దలు దీనిని గమనించి అయినా ఉపాధి కల్పన పట్ల శ్రద్ధ వహిస్తారో లేదో త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తేలనుంది.

సందర్భం

నేడు ఇ.ఎం.ఎస్ జయంతి

సాధారణ ప్రజానీకానికి
మతమంటే ఏమిటో తెలియదు.
వాళ్ళకు దేవుడొక్కడే.
జీవితావసరాలే ఆ దేవుడు.
- ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

జననం: 13.6.1909

మరణం: 19.3.1998

విశ్లేషణ

ప్రభుత్వ బడిని బతికించుకుందాం

అమ్మ లాంటి ప్రభుత్వ బడి. అమ్మా నాన్న కూలికి వెళితే అక్కున చేర్చుకుని విద్యా బుద్ధులు నేర్పిన బడి. సమాజంలో ఎలా బతకాలో నేర్పిన బడి. ఎదుటివారి కష్టాన్ని తన కష్టంగా భావించడం తన జీవనంలో భాగంగా చూడమన్న బడి. పెద్దలను గౌరవించండి, తల్లిదండ్రులను పూజించండి అని రోజూ ఓనమాలు దిద్దించిన బడి. ఇప్పుడు ఏదో పాడు ప్రపంచీకరణ వచ్చి అమ్మ, బడి నేర్పాల్సిన దాన్ని సెల్‌ఫోన్ నేర్పుతుంది కానీ..ఆ రోజుల్లో బడే నేర్పేది. పాఠశాల ప్రారంభం కాబోతుంది కనుక ఆ బడిని రక్షించుకోవడం కోసం ఉపాధ్యాయులుగా, సమాజంగా ఏం చేయాలో చూద్దాం.

పాఠశాలలు-పిల్లలు

ఏప్రిల్ 30, 2021 ప్రభుత్వ లెక్కల ఆధారంగా ప్రాథమిక పాఠశాలలు ప్రభుత్వ రంగంలో 33,813 ఉంటే, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు 1,287 ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో ప్రాథమికోన్నత పాఠశాలలు 4,158 ఉంటే, ఎయిడెడ్ పాఠశాలలు 250 ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో ఉన్నత పాఠశాలలు 6,648 ఉంటే, ఎయిడెడ్ పాఠశాలలు 435 ఉన్నాయి. 2021 ఏప్రిల్ నాటికి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 44,54,038.

ఎన్. వెంకటేశ్వర్లు

జిఓ 117 పేరుతో పాఠశాలలకు సంఖ్యను 6 పాఠశాలలుగా మార్చిన తర్వాత కచ్చితమైన లెక్కలు ప్రభుత్వం నుంచి బహిర్గతం కాలేదు. కొన్ని జిల్లాల నుంచి సేకరించిన సమాచారం మేరకు ఫౌండేషన్ స్కూళ్ల అంటే 1,2 తరగతులు మాత్రమే నిర్వహించే పాఠశాలలు మొత్తంగా 4600 ఉంటే దానిలో 20 లోపు ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాల 2,730. ఫౌండేషన్ ప్లస్ అంటే ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా 27,000 పైచిలుకు ఉంటే ... 8,900 వరకు 20 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు ఉన్నాయి. అంటే సుమారుగా 12,000 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రశ్నార్థకంగా మారిపోయింది.

ప్రీ హైస్కూల్ అంటే 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న మొత్తం పాఠశాలలు 3,500 దాకా ఉన్నాయి. వీటిలో 30 లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 900 వరకు ఉన్నాయి. ఉన్నత పాఠశాలలు 5,400 దాకా ఉంటే దీనిలో 100 లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 450 దాకా ఉన్నాయి. 20 లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలు 30 లోపు వున్న ప్రీ హైస్కూళ్లు, 100 లోపు ఉన్న ఉన్నత పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారబోతుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే హైస్కూల్‌లో చదువుతున్న మూడో తరగతి విద్యార్థికి సబ్జెక్టు టీచర్లతో పాఠాలు, అదే ఒక ప్రాథమిక పాఠశాలలో లేదా ప్రీ హైస్కూల్‌లో 8వ తరగతి దాకా ఉన్న యూపీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థికి సబ్జెక్టు టీచర్లతో బోధన ఉండదు. ఒక భిన్నమైన విద్యా విధానం గత రెండు సంవత్సరాల కాలంగా అమలు చేయబడింది. మేధావులు, ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు దీన్ని సరిచేయాలని ఇది సరైన పద్ధతి కాదని చెప్పినా ఇది మా పాలసీ అనే పేరుతో అప్పటి ప్రభుత్వం అమలు చేసుకుంటూ పోయింది.

దీంతో ఈ రోజున 12,000 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. అలాగే కొన్ని ఉన్నత పాఠశాలల డీ గ్రేడ్, కొన్ని యూపీ పాఠశాలల డిగ్రేడ్‌గా మారిపోయాయి. ఎయిడెడ్ పాఠశాలలు కనుమరుగు అయిపోయాయి. ఇప్పుడు ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ చూస్తే ఈ లెక్కలు కూడా ప్రభుత్వం అధికారికంగా ఎక్కడా వెబ్‌సైట్‌లో పెట్టలేదు. కానీ 36 లక్షలకు మించి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం లేదనేది అర్థమవుతుంది. ప్రాథమిక పాఠశాల వ్యవస్థ జిఓ 117 వల్ల అస్తవ్యస్తంగా మారిపోయింది. అక్కడ చదివే పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారో ప్రైవేటు పాఠశాలకు వెళ్లారో కూడా గణాంకాలు లేని పరిస్థితులు ఏర్పడతాయి. పాఠశాల స్ట్రక్చర్, మౌలిక వసతులు, పిల్లలకు కావలసిన సదుపాయాలు కలుగచేసిన తర్వాత కూడా పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గడానికి కారణమేమిటో, ఉపాధ్యాయ పోస్టులు కుదించబడటానికి కారణమేమిటో సమీక్ష జరగకపోవటం ప్రధాన లోపంగా ఉన్నది. ఇప్పటికైనా తక్షణం ఈ విద్యారంగంలో చేస్తున్న మార్పుల మీద ఒక స్పష్టమైన సమీక్ష జరగాలి. దాన్ని సరిచేసుకుని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసుకునేవైపు ప్రణాళికలు ఉండాలి.

బైజూస్, సిబిఎస్ఇ, టోఫెల్, ఐఎఫ్‌బి ప్యానల్....ఇలా అనేక పథకాలు పాఠశాలలోకి వచ్చి చేరాయి. ఏ పాఠశాలలో ఏ సిలబస్ ఉందో, ఏ పరీక్షా విధానం ఉందో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపైన మాట్లాడుకోవడం గానీ, చర్చించుకోవడం గానీ సమగ్రంగా జరగలేదు. మరో విచిత్రం ఏమంటే ఉపాధ్యాయులు తమ సొంత నెట్, సెల్‌ఫోన్‌లోనే అన్ని యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవటం. పిల్లలకు ఏమైనా నాలుగు అక్షరాలు వచ్చాయా అనే దానికంటే ఉపాధ్యాయులు యాప్‌లు నింపడం, ఫార్మేట్లు పూర్తి చేయటం మీదే పర్యవేక్షణ సాగింది. పర్యవేక్షణ పాఠశాలలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించింది. ఒక్క ఉపాధ్యాయులే కాదు. విద్యార్థులు, తల్లిదండ్రులు, డీఈఓ, ఆర్‌జెడి, పై అధికారులు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక స్వేచ్ఛాయుత వాతావరణం పాఠశాలలో దెబ్బతిన్నది.

సమాజంలో నైతిక విలువలు, ప్రజాస్వామ్య విలువలు దృఢంగా నిలబడాలన్నా, మానవత్వం పరిమళించాలన్నా, శ్రమజీవుల గురించి ఆలోచించే గొంతుకలు కావాలన్నా, ప్రశ్నించే తత్వం, పరిశోధనలు పెరగాలన్నా, భవిష్యత్తు తరంలో సమానత్వపు ఆలోచనలు పెంపొందించాలన్నా, చదువుకున్న చదువుని సమాజం కోసం నిస్వార్థంగా వినియోగించాలన్నా ప్రభుత్వ బడి వుండాలి. డబ్బుతో కొనుక్కునే చదువు ద్వారా తయారైన పౌరుడు ప్రతిదాన్ని కొనుక్కునే వైపుగానే ఆలోచిస్తాడు. విద్యార్థి పరిపూర్ణ మానవత్వం కలిగిన వ్యక్తిగా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడాలంటే ప్రభుత్వ బడిని బతికించుకోవాలి. కనుక ప్రభుత్వ బడిని రక్షించుకోవాల్సింది, బలోపేతం చేయాల్సింది ఆ రంగంలో పని చేస్తున్న ఉపాధ్యాయులే.

బడి కోసం ఉపాధ్యాయులు

విద్యార్థి బడి ద్వారా సమాజంలో మంచి పౌరుడుగా మారడానికి టీచరు ఉపయోగపడాలి. నిరంతరం తల్లిదండ్రులతో మమేకం అవ్వాలి. పిల్లల యోగక్షేమాన్ని అడిగి మనోధైర్యాన్ని ఇవ్వాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించడానికి నిరంతరం ప్రత్యేక కృషి చేయాలి. చదవటం, రాయటం ప్రతి విద్యార్థికి వచ్చే బాధ్యత తీసుకోవాలి. మన బడికి వచ్చే పిల్లలు ఆర్థికంగా సామాజికంగా వెనకబడిన వారినే విషయం స్పృహలో ఉంచుకోవాలి. తల్లిదండ్రులు ఇచ్చే ఆప్యాయతను విద్యార్థికి బడిలో ఉపాధ్యాయులు ఇవ్వాలి. బడి సమయాన్ని పిల్లల కోసం మాత్రమే కేటాయించాలి. ఉపాధ్యాయుల జీతాలు తల్లిదండ్రులు, సమాజం కట్టే పన్నుల నుంచే వస్తున్నాయనే వాస్తవాన్ని గ్రహించి, పిల్లల తల్లిదండ్రులతో, సమాజంతో అనుసంధానం అయ్యేలా వారి పని ఉండాలి. ప్రతి రోజు నూతన అంశాలు, నిరూపించిన శాస్త్రీయ అంశాలు బోధించాలి. విద్యార్థుల్లో చదువుల పట్ల ఆసక్తి కలిగించేటట్లు పని మెరుగు పరచుకోవాలి. ఏదైనా పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే, ఉత్తీర్ణత కాకపోతే తనువు చాలించడం కాకుండా మనోధైర్యంతో బతికేటట్లు, మరల విజయాన్ని అందుకునేటట్లు ప్రోత్సహించాలి. కష్టం, శ్రమ, నిజాయితీ లాంటి నైతిక విలువలను నేర్పాలి. మొత్తంగా బడి చుట్టూ ఒక సామాజిక కంచెను ఏర్పాటు చేసుకోవాలి. సమాజంలో మనం మనలో సమాజం భాగంగా ఉంటుందని భావనతో ఉపాధ్యాయులు తమ పనిని అభివృద్ధి చేసుకునే వైపు ఉండాలి. బడి తల్లిదండ్రుల ఆదరాభిమానాల్ని పొందే విధంగా టీచర్లు ఆదర్శంగా ఉండాలి. అవసరమైతే ఒక గంట అదనంగా పనిచేయడానికి సిద్ధపడాలి. బడి నుంచి బయటికి వెళ్లిన విద్యార్థి సమాజంలో ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా బతకగలిగే సామర్థ్యాన్ని ఇవ్వగలిగేలా బోధన ఉండాలి. ఎలాంటి ఆటంకాలు ఎదురైనా బడి సమయంలో పిల్లల చుట్టూ, పిల్లల అభివృద్ధి చుట్టూనే ఉపాధ్యాయుల ఆలోచనలు, ఆచరణ, కార్యాచరణ ఉండాలి.

బడి కోసం ప్రభుత్వం

బోధనకు మాత్రమే ఉపాధ్యాయుని పరిమితం చేయాలి. పాఠశాల పర్యవేక్షణ కక్ష సాధింపు ధోరణితో కాకుండా పొరపాట్లను సరిచేసుకునే పద్ధతిలో ఉండాలి. విద్యారంగానికి హాని చేసే జీవో 117ని పూర్తిగా రద్దు చేయాలి. విద్యార్థి ఏ మీడియంలో చదువుకోవాలనే దానిపై విద్యార్థికి స్వేచ్ఛనివ్వాలి. ప్రాథమిక పాఠశాల విద్య మాతృభాషలో మాత్రమే ఉండాలి. మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో రెండు మీడియంలను అనుమతించాలి. ఖాళీలన్నీ డిఎస్సీ ద్వారా తక్షణం భర్తీ చేసి ఉపాధ్యాయుల కొరత లేకుండా చేయాలి. ఎంఈఓ-2, ప్లస్ టు పాఠశాలల వ్యవస్థపై సమీక్ష జరపాలి. ప్రతి పంచాయతీకి అన్ని హంగులతో ఒక ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ఉండేటట్లుగా ఏర్పాట్లు జరగాలి. ఉపాధ్యాయుల సమస్యలను విని పరిష్కరించే ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. బదిలీల కౌన్సిలింగ్ విధానాన్ని బలోపేతం చేసే విధంగా బదిలీల చట్టాన్ని రూపొందించాలి. బదిలీల చట్టానికి భిన్నంగా ఎలాంటి బదిలీలు చేయడానికి అనుమతించకూడదు. యాప్‌లు, సెక్షన్లు, ఫార్మేట్లు పూర్తి చేయటం అనేది పాఠశాల పరిధిలో ఉండకూడదు. పాఠశాల పనిదినాలలో ఎలాంటి శిక్షణలు ఉండకూడదు. బడి అంటే పిల్లల కేంద్రంగా ఉండాలి. పిల్లలకు నైపుణ్యమైన, నాణ్యమైన విద్య అందించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలి. సాంకేతిక పరిజ్ఞానం అదనపు సోర్సుగా ఉండాలి తప్ప ఉపాధ్యాయుడు మింగివేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుమతించకూడదు. స్కీముల పేరుతో రోజుకో రకమైన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం కూడదు. రాష్ట్ర అవసరాలను తీర్చగలిగిన నూతన తరాన్ని తయారు చేసేటట్లు రాష్ట్ర విద్యా విధానం రూపొందించాలి. మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో నిరంతరం విద్యలో చేస్తున్న మార్పులపై సమగ్ర చర్చ జరిపి, అందరి ఆమోదంతో అమలు చేయాలి. అంతిమంగా ప్రభుత్వ బడిని బలోపేతం చేసే వైపు కార్యాచరణ, ప్రణాళిక, బడ్జెట్ కేటాయింపులు జరగాలి. బడిలో ఉపాధ్యాయుడికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలి.

ప్రభుత్వ బడికి ప్రత్యామ్నాయం లేదు

సమాజంలో నైతిక విలువలు, ప్రజాస్వామ్య విలువలు దృఢంగా నిలబడాలన్నా, మానవత్వం పరిమళించాలన్నా శ్రమజీవుల గురించి ఆలోచించే గొంతుకలు కావాలన్నా, ప్రశ్నించే తత్వం, పరిశోధనలు పెరగాలన్నా, భవిష్యత్తు తరంలో సమానత్వపు ఆలోచనలు పెంపొందించాలన్నా, చదువుకున్న చదువుని సమాజం కోసం నిస్వార్థంగా వినియోగించాలన్నా ప్రభుత్వ బడి వుండాలి. డబ్బుతో కొనుక్కునే చదువు ద్వారా తయారైన పౌరుడు ప్రతిదాన్ని కొనుక్కునే వైపుగానే ఆలోచిస్తాడు. విద్యార్థి పరిపూర్ణ మానవత్వం కలిగిన వ్యక్తిగా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడాలంటే ప్రభుత్వ బడిని బతికించుకోవాలి. కనుక ప్రభుత్వ బడిని రక్షించుకోవాల్సింది బలోపేతం చేయాల్సింది ఆ రంగంలో పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయులే. ఉపాధ్యాయ హక్కుల కోసం ఎంతగా కదులుతున్నామో, ఎంతగా తపిస్తున్నామో, హక్కుల రక్షణకు ఎంతగా ఆలోచిస్తున్నామో అంతకంటే ఎక్కువ బాధ్యతతో, చిత్తశుద్ధితో ప్రభుత్వ బడిని బతికించుకునేందుకు కదలాలి. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ముందుకు కదలాలి. నిరంతరం సమాజంతో మమేకం కావాలి.

/ వ్యాసకర్త యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు/

వ్యాఖ్య

పౌరహక్కుల పరిరక్షణ : అప్రమత్తత అవసరం

ప్రస్తుత 18వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు మారాయి. గత సభలో తన పార్టీకి ఉన్న మందబలం వల్ల మోడీ ఏం చేసినా చెల్లింది. ఎన్.డి.ఎ లోని మిగతా పార్టీలు బిజెపి కి తందాన దాసులే. కనుక తన రాజకీయ ఎజెండాకు అనుగుణంగా బిజెపి గత పదేళ్లలో మానవ హక్కులపై తీవ్రమైన దాడి చేసింది. మానవ హక్కుల కోసం, ప్రజాస్వామిక విధానాల కోసం నిలిచిన వారిపై దాడుల పరంపరను కొనసాగించింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు అంకెలతో సహా భారతదేశం లోని మానవ హక్కుల దుస్థితిని వెల్లడించాయి.

గత పదేళ్లలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేసిన ప్రజా వ్యతిరేక చట్టాలు కాంగ్రెస్ కాలంలో ఆమోదించినవే. వాటికి మోడీ మరింత పదును పెట్టి వాడారు. కాంగ్రెస్ అనుసరించిన ఆ విధానాల పట్ల వ్యక్తమైన వ్యతిరేకత మూలంగానే బిజెపి దాని మిత్రపక్షాలు అధికారానికి ఎగబాకాయి. ఈ దశలో కాంగ్రెస్ ఆ విధానాలను అడుగడుగున వ్యతిరేకించి మోడీ ప్రభుత్వాన్ని నిలేస్తుందా? ఉపేక్షిస్తుందా? అన్నది ముఖ్యమైన ప్రశ్న.

ఎస్. వినయకుమార్

ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మించడంలో ప్రతిపక్ష పార్టీలు, మేధావులు ప్రజాసంఘాలతో పాటు మీడియా కూడా ప్రధాన పాత్ర వహించాలి. కాని మోడీ హయాంలో అది గోడీ మీడియా (మోడీ బడిలో చేరిన మీడియా)గా మారింది. ఆ బంధనాల నుండి మీడియా సంస్థలు ఇప్పుడైనా బయటపడి స్వేచ్ఛగా వ్యవహరిస్తాయా? అన్నది కూడా ఇంకా ప్రశ్నార్థకమే.

భారత రాజ్యాంగం పనికి రాదని, అది అతుకుల బొంత అని మోడీ మొన్నటి దాకా అన్నారు. ఎన్నికల ఫలితాల్లో తల బొప్పి కట్టేసరికి రాజ్యాంగాన్ని కళ్లకద్దుకొన్నారు. ఆయన అవకాశవాద మిత్రుల్లో ఒకరైన చంద్రబాబు గతంలో ఒకసారి తానే కేంద్ర ప్రభుత్వంలో చక్రం తిప్పాననే భ్రమల్లో ఉండిన, ఈసారి కూడా తాను చక్రం తిప్పబోతున్నట్లు జనాన్ని నమ్మించే పనిలో ఉన్నారు. నితీష్ కుమార్, పాశ్వాన్‌లు అగ్నివీర్ పథకాన్ని సమీక్షించాలని ఓ మాటైనా అన్నారు. కాని మోడీ వాచ్‌మెన్ (దేశానికి కాపరి) కాదు, ఒట్టి అబద్ధాలకోరు అని ఆక్రోశించిన తనే ఇప్పుడు నమో మోడీ అంటున్నారు.



నిరుడు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన రిపోర్టులో ఇండియాలో మానవ హక్కులపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక నేరాలపై దర్యాప్తు జరపాల్సిన సంస్థలు అధికార బిజెపి చేతిలో ఆయుధాలయ్యాయని అది పేర్కొంది. మానవ హక్కుల సంఘాల కార్యకర్తలపై, జర్నలిస్టులపై, విమర్శకులపై, అలాగే ముస్లింలపై దాడులు పెద్ద స్థాయిలో జరుగుతున్నాయని వెల్లడించింది. ముస్లింల ఆస్తులపై, ఇళ్లపై , పార్థనా స్థలాలపై దాడులు చేసిన వారికి శిక్షలు కూడా పడటంలేదని ఎత్తి చూపింది.

మోడీ సర్కార్ ఈసారి నీట్ స్కామ్‌తో పాలన మొదలెట్టింది. పోయిన సారి పి.ఎం కేర్స్, ఎన్నికల బాండ్లు, గుత్త పెట్టుబడిదార్లకు కోటానుకోట్ల అప్పుల రద్దు వంటి అవినీతి స్కామ్‌లతో పాటు మానవ హక్కుల పట్ల కూడా మోడీ దుర్మార్గంగా వ్యవహరించారు. ఆ దుర్మార్గాల్లో ఒకటి బీమా కోరేగావ్ కేసు. అర్థం పర్థం లేని ఆరోపణలతో ఆ కేసు బనాయించారు. కేసులో అరెస్టయిన స్టాన్‌స్వామి లాంటి వృద్ధ సంఘ సేవకుడు జైల్లో అమానుష పరిస్థితుల్లో చనిపోయినా మోడీ ప్రభుత్వానికి దున్నపోతు మీద ఈగ వాలినట్లు కూడా కాలేదు. ఆ కేసులోని మరో ముద్దాయి విరసం నేత వరవరరావు కండిషనల్ బెయిల్ మీదే ఇంకా బొంబాయిలోనే ఉన్నారు. ఆ కేసు విచారణ ఎప్పటికి ముగుస్తుందో చెప్పలేని స్థితి. వెనుకటికి టాడా చట్టాన్ని వ్యతిరేకించిన బిజెపి తన హయాంలో ఉపా చట్టం కింద బెయిల్‌కు కూడా అవకాశం లేకుండా సవరణ చేసింది. అనేక మంది పాత్రికేయులను అది రాచి రంపాన పెట్టింది. వారి ఇళ్లపై దాడి చేసింది. న్యూస్‌క్లిక్ యూట్యూబ్ చానెల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ వంటి వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. 2022 నుండి 2024 వరకు రెండేళ్ల కాలంలో ఉపా కింద దేశంలో 10,552 మందిని అరెస్టు చేశారు. అదే సమయంలో అహ్మదాబాదు హింసాకాండలో జీవిత ఖైదు పడిన వారికి మాత్రం శిక్ష ముగియక ముందే రెమిషన్ ఇచ్చి వదిలేశారు.

ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్‌ను, కేరళలో సిపిఎం జిల్లా కమిటీ అకౌంట్ ఒకదాన్ని స్తంభింపచేయడంతో పాటు తనకు వ్యతిరేకులైన రాజకీయ నేతలపై ఆర్థిక నేరాలు మోపి ముప్పుతిప్పలు పెట్టింది. ఇద్దరు ముఖ్యమంత్రులను సైతం జైల్లో పెట్టింది. ఆర్థిక కుంభకోణాల్లో ఇరుక్కొన్న వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు తమ పార్టీలను వదలి బిజెపిలో చేరారు. మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా వారి కేసులను పక్కకు పెట్టింది. ఆ ధోరణి మోడీ మూడో అవతారంలోనూ కొనసాగవచ్చు. లోక్‌సభలో పార్టీల బలాబలాలు మారిన స్థితిలోనైనా మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్లమెంట్‌లో, వెలుపలా తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ఎంత బలంగా ముందుకొస్తుందో చూడాల్సిందే.

భారతదేశంలో నియంతృత్వం రాజ్యమేలుతున్న విషయాన్ని అంతర్జాతీయ సంస్థలు సరిగ్గానే గుర్తించాయి. ఆ సంస్థల విమర్శలకు జవాబు చెప్పలేని మోడీ 'మా దేశంలో నియంతృత్వం లేదని, ఆదిమ కాలం నుండే భారతీయుల నరనరాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని' ఐరాస వేదికపై సెంటిమెంటల్ డైలాగులు చెప్పారు. అదే మోడీ న్యూఢిల్లీలో గత ఏడాది జరిగిన జి 20 దేశాల సమావేశం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను సైతం మీడియాతో మాట్లాడనివ్వలేదు.

నిరుడు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన రిపోర్టులో ఇండియాలో మానవ హక్కులపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక నేరాలపై దర్యాప్తు జరపాల్సిన సంస్థలు అధికార బిజెపి చేతిలో ఆయుధాలయ్యాయని అది పేర్కొంది. మానవ హక్కుల సంఘాల కార్యకర్తలపై, జర్నలిస్టులపై, విమర్శకులపై, అలాగే ముస్లింలపై దాడులు పెద్ద స్థాయిలో జరుగుతున్నాయని వెల్లడించింది. ముస్లింల ఆస్తులపై, ఇళ్లపై, ప్రార్థనా స్థలాలపై దాడులు చేసిన వారికి శిక్షలు కూడా పడటంలేదని ఎత్తి చూపింది.

కాశ్మీర్, మణిపూర్ లోనే కాదు పంజాబ్‌లోనూ దేశంలో ఇతర ప్రాంతాల్లోనూ మోడీ ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపేసింది. అక్కడ కొన్ని చోట్ల చాలా కాలం పాటు నిలిపేస్తే కొన్ని చోట్ల స్వల్ప కాలం నిపిపేసింది. సాగుతున్న హింసాకాండ వివరాలు బయటి ప్రపంచానికి వెల్లడి కాకుండా చూశారని ఆమ్నెస్టీ ఎత్తి చూపింది. మణిపూర్‌లో క్రైస్తవ ఆదివాసీలపై అమానుష దాడులు జరుగుతుండగా ప్రభుత్వం వాటిని నిలువరించేందుకు ప్రయత్నించలేదు. ట్విట్టర్ (ఈనాడు)పై కూడా నిషేధాలు విధించే ప్రయత్నం చేశారు. సోషల్ మీడియాలో తమను ప్రశ్నించిన వారిని సంఘ్ పరివార్ సహించలేదు. తాము అట్టడుగు వారి కోసం ఎన్నో పథకాలు చేపట్టామనే నమో ప్రభుత్వం మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించినప్పటికీ దేశంలో 2018 నుండి సివరేజి కాలువలను శుభ్రం చేస్తూ 300 మంది చనిపోయారు. 2021లో దేశంలో రోజుకు సగటున మహిళలపై 86 అత్యాచార కేసులు నమోదయ్యాయి. వీటిలో బలహీన వర్గాలపై బలవంతులు చేసిన అత్యాచారాలే ఎక్కువ.

జి20 సమావేశాల నేపథ్యంలో యు.ఎన్ మానవ హక్కుల కౌన్సిల్‌తో భారత్ ఒక ఒప్పందానికి వచ్చింది. దేశంలో కుల వివక్షను తొలగిస్తామని, భావ ప్రకటనా స్వేచ్ఛకు గ్యారెంటీ ఇస్తామని, మతపర మైనారిటీల హక్కుల్ని రక్షిస్తామని భారత ప్రభుత్వం ఒప్పుకొంది. విదేశీ విరాళాల చట్టం (ఎఫ్‌సిఆర్ఎ), చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం, (ఉపా), దేశద్రోహ చట్టం, నేరపూరిత పరువు నష్టం చట్టం వంటి వాటిలో ప్రజాస్వామిక సవరణలు చేస్తామని అంగీకరించింది. కాని వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. దళితులు, ఆదివాసీలపై వేధింపులు అత్యాచారాలు కొనసాగాయి. ముస్లింలను నేరస్తులుగా చూపడానికి మాత్రమే పౌరసత్వ చట్టంలో మార్పు చేసింది.

రాజద్రోహం కేసులన్నీ రాజకీయ దృష్టితో పెట్టినవవే. అందులో సందేహం లేదు. కాగా ఆ చట్టం కింద విధించే శిక్షను ఏడేళ్ల నుండి పదేళ్లకు పెంచింది. కోర్టు తీర్పులనూ పట్టించుకోలేదు. విధాన పరమైన అంశాలపై పరిశోధన చేసే సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ లైసెన్సును ఆరు నెలలపాటు సస్పెండ్ చేసింది. ప్రముఖ మానవ హక్కుల నాయకుడు, మాజీ ఐఎఎస్ అధికారి హర్ష మందర్ ఆధ్వర్యంలో నడిచే సంస్థ అది. ఆయన నడిపే అమన్ బిరాదరి (ఇరుగు పొరుగులో శాంతి) అనే సంస్థపై కూడా విచారణకు ఆదేశించారు. సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చి, ఆక్స్‌ఫాం ఇండియా, కేర్ ఇండియా సంస్థలకు ఇచ్చిన పన్ను మినహాయింపును రద్దు చేశారు. దేశంలోని బలమైన మీడియా మోడీకి బంటుగా మారింది. కనుక పౌరహక్కుల సంరక్షణలో అది తన బాధ్యత నిర్వహిస్తుందని ఇప్పట్లో ఆశించలేము. అభ్యుదయ మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాలు నేడు ముందుకొచ్చి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి. కాంగ్రెస్‌తో సహా 'ఇండియా' బ్లాకులోని అన్ని పక్షాలు పౌరహక్కుల కోసం నేడు ఉద్యమాలను నిర్మించడానికి ముందుకు రావాలి.

/వ్యాసకర్త ప్రజాశక్తి పూర్వ సంపాదకులు/

ఆరెస్సెస్ మరో వంచన

- బిజెపి ఓటమికి వింత భాష్యం
- మిడిసిపాటు తగదంటూ సుద్దులు

నాగపూర్ : లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓటమి తరువాత ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఆరెస్సెస్ మరో వంచనకు అతి పెద్ద నిదర్శనం. 'అహంకారం లేనివాడే నిజమైన సేవకుడు, ఇతరులను నొప్పించకూడదు. సమాజంలో విభజనలు సృష్టించడం తగదు, ప్రత్యర్థులను విరోధులుగా చూడకూడదు ఇతరులను కూడా గౌరవించాలి'.. నాగపూర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశంలో ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్న మాటలివి.

ఆరెస్సెస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' తాజా సంచికలో ప్రచురితమైన ఒక వ్యాసం కూడా ఇదే రీతిన సాగింది. బిజెపి ఓటమికి ఆ పార్టీ నాయకుల అతి విశ్వాసమే కారణ మని అది తేల్చేసింది., ఎన్నికల్లో పనిచేసేందుకు సైద్ధాంతిక మిత్రులు (ఆరెస్సెస్ అనుబంధ సంఘాల) సహకారం అవసరమని, ఈ సారి ఎన్నికల్లో బిజెపి ఆ పని చేయలేదని ఆ వ్యాస రచయిత అరెస్సెస్ క్రియాశీలక సభ్యుడ రతన్ శారదా సెలవిచ్చారు. ఇవన్నీ ఆరెస్సెస్ ఆడుతున్న నాటకంలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు కొందరు పేర్కొన్నారు. బిజెపి గత రెండు పర్యాయాలు గెలిచినప్పుడు అది హిందూత్వ ఎజెండాకు లభించిన విజయంగా చెప్పుకున్నవారు, ఇప్పుడు ఓటమి ఎదురయ్యేసరికి అది ఆ పార్టీ నాయకత్వ వైఫల్యంగా చిత్రించడం సంఘ్ పరివార్‌కు అలవాటైన విద్య అని వారు పేర్కొంటున్నారు.

బిజెపి సమర్థత తగ్గినప్పుడే ఆర్‌ఎస్‌ఎస్ అవసరం వస్తుందని మోహన్ భగవత్ అనడం కూడా ఈ గేమ్ ప్లాన్‌లో భాగమే.. ఆరెస్సెస్‌కు అత్యంత సంతృప్తినిచ్చే

ప్రభుత్వమే గత పదేళ్లుగా కేంద్రంలో ఉన్నది. గత టర్మ్‌లో సంఘ్ పరివార్ దీర్ఘకాలిక ఎజెండాలో ముఖ్యమైనవాటిని మోడీ ప్రభుత్వం ఆచరణలో పెట్టింది. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చిన చోట నిర్మించిన ఆలయాన్ని ప్రధాని స్వయంగా ప్రారంభించారు. మోహన్ భగవత్ దగ్గర ఉండి ఇదంతా నడిపించారు. ఆ ప్రసంగంలోనే దేశ రాజ్యాంగాన్ని కూల్చేస్తామన్న సందేశాన్ని మోడీ ఇచ్చారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాల స్థాయికి కుదించారు. మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించే సిఎఎ చట్ట సవరణను తీసుకొచ్చారు. ఏక రూప పౌర స్మృతి అమలుకు చట్టాన్ని తీసుకొచ్చేందుకు యత్నించారు. ఇవన్నీ ఆరెస్సెస్ ప్రమేయం లేకుండానే బిజెపి చేసిందా?

ఈ సారి 400కిపైగా ఎంపీ సీట్లు గెలవాలని లక్ష్యంగా బిజెపి ప్రకటించడం ఆ పార్టీ శ్రేణులు అర్థం చేసుకోలేకపోయాయని, బిజెపి అతి విశ్వాసానికి ఇదొక నిదర్శనమని ఆర్గనైజర్‌లో రాశారు. బిజెపి నాయకులు 400కిపైగా సీట్లు లక్ష్యాన్ని ప్రకటించి, ఊహల బుడగలో ఊరేగారు. పోస్టర్లు షేర్ చేసుకుంటూ, సోషల్ మీడియాలో సెల్ఫీలు పెట్టుకుంటే సరిపోతుందా. లక్ష్యాన్ని చేరుకోవడానికి కఠోర శ్రమ చేయనవసరం లేదా అంటూ ఆరెస్సెస్‌కు తెలియకుండానే బిజెపి ఈ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వ్యాస రచయిత నమ్మబలికారు. నిజానికి ఇది ఆరెస్సెస్ శతవార్షికోత్సవ సంవత్సరం. మోడీ ప్రభుత్వ మూడవ టర్మ్‌లో 400 కిపైగా సీట్లు సాధిస్తే, ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసి భారత్‌ను మత రాజ్యంగా ప్రకటించాలనేది సంఘ్ పరివార్ అసలు ఉద్దేశం. బిజెపి ఎంపీ అనంత కుమార్ హెగ్డే, నాగపూర్ బిజెపి ఎంపీ అభ్యర్థి జ్యోతి మీర్ధా, ఫైజాబాద్ బిజెపి ఎంపీ లల్లూ సింగ్, మీరట్ బిజెపి ఎంపీ అభ్యర్థి అరుణ్ గోవిల్ వంటి వారు ఈ విషయాన్ని కుంటబద్దలు కొట్టినట్లు చెప్పారు. కాబట్టి ఆరెస్సెస్‌కు తెలియకుండానే ఇదంతా జరిగిందని చెప్పడం వంచనే తప్ప మరొకటి కాదు. బిజెపిలోకి కాంగ్రెస్ నుంచి వచ్చినవారే కాషాయ బీభత్సానికి, హిందువులను వేధించడం వంటి వాటికి కారకులన్నట్లు ఆర్గనైజర్‌లో వ్యాసకర్త ఆరోపించడం సంఘ్ పరివార్ అసత్య ప్రచారానికి మరో నిదర్శనం.

బిజెపి నాయకులు విభజన రాజకీయాలు, విద్వేష ప్రసంగాలు చేస్తున్నప్పుడు నోరు మెదపకుండా ఎన్నికల ఫలితాలు వచ్చాక విద్వేష రాజకీయాలు కూడదని సుద్దులు చెప్పడంలోనే దాని మోసకారితనం ఉంది. . అలాగే మణిపూర్ ఘర్షణల గురించి మోహన్ భగవత్ ప్రస్తావిస్తూ పది సంవత్సరాల పాటు ఆ రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నదని, తుపాకీ సంస్కృతి అంతరించిందని అందరూ భావించారని అంటూ ఇప్పుడు నిప్పు రాజేయాలని అనుకున్నది ఎవరని ప్రశ్నించారు. మణిపూర్‌లో మైనార్టీలపై దాడులు సంఘ్ పరివార్ పన్నాగంలో భాగం కాదా? మణిపూర్‌లో రెండు ఎంపీ స్థానాల్లోను బిజెపి ఓడిపోవడంతో మోహన్ భగవత్ అక్కడ జరిగినదానికి తమకు సంబంధం లేనట్లు మాట్లాడడం ఎవరిని వంచించడానికి?

గత నెలలో బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా చేసిన వ్యాఖ్యలపైనా ఇటువంటి గందరగోళాన్ని సృష్టించేందుకు ఆరెస్సెస్ ప్రయత్నించింది. నడ్డా వ్యాఖ్యలపై భగవత్ సూటిగా ప్రస్తావించకపోయినా ఆర్గనైజర్ పత్రికలో మాత్రం దీనినొక వివాదంగా చూపే ప్రయత్నం చేశారు. బిజెపిని తాము నడపగలమని, ఆ సామర్థ్యం తమకు ఉన్నదని ఆ పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా ఎన్నికల సమయంలో 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికతో అన్న మాటలను వ్యాసకర్త రతన్ శారదా ఆక్షేపించారు. జెపి నడ్డాను ఈ సారి బిజెపి అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఫీలర్లు వదిలారు. నడ్డా స్థానంలో ఈ సారి కరడు గట్టిన ఆరెస్సెస్ వాదిని నియమించబోతున్నట్లు లీకులు ఇస్తున్నారు. నిజానికి బిజెపి ఆరెస్సెస్ అనుబంధ రాజకీయ విభాగమని, మోడీ పూర్తికాలపు ఆరెస్సెస్ కార్యకర్త అనే విషయం అందరికీ తెలిసిందే.

తమిళసైకు అమిత్ షా బెదిరింపులు?

- చంద్రబాబు ప్రమాణస్వీకారంలో ఘటన
- వైరల్‌గా మారిన వీడియో

విజయవాడ : తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను బెదిరిస్తున్నట్లుగా అమిత్ షా ఏదో చెబుతున్న వీడియో ఇప్పుడు దేశంలో వైరల్‌గా మారింది. బుధవారం చంద్రబాబు ప్రమాణస్వీకారంలో జరిగిన ఈ ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో తమిళసై, అమిత్ షా పాల్గొన్నారు. తమిళిసై వేదికపై ఉన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, అమిత్ షాను ఆమె పలకరించారు. ఆ తర్వాత ఆమె అక్కడినుంచి ముందుకువెళ్తుంటే.. అమిత్ షా ఆమెను వెనక్కి పిలిచారు. తర్వాత వారిద్దరి మధ్య సంభాషణ జరిగింది. ఈ క్రమంలోనే అమిత్‌షా ఆమెను హెచ్చరిస్తూ వేలి చూపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమిళనాడు అధికార పార్టీ డిఎంకె ఈ ఘటనపై స్పందించింది. "తమిళనాడుకు చెందిన ఒక ప్రముఖ నాయకురాలిని ఇలా బహిరంగంగా మందలించడం తగునా? ఇది అందరు చూస్తారని తెలుసుకోవాలి. ఇది తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని డిఎంకె అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై అన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తమిళనాడులో బిజెపి ఘోరంగా ఓటమి చెందింది. ఈ తరువాత అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, తమిళిసై మధ్య విబేధాలు తలెత్తాయని సమాచారం. ఈ నేపథ్యంలో తమిళసైను అమిత్‌షా హెచ్చరించినట్లు భావిస్తున్నారు.

ఒడిషా సిఎంగా మోహన్ మాఝీ ప్రమాణస్వీకారం

భువనేశ్వర్: ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా మోహన్ చరణ మాఝీ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, తొలిసారి ఎమ్మెల్యే అయిన ప్రవతి పరీదాలు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రులుగా సురేశ్ పుజారి, రబీనారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, కష్ణ చంద్ర పాత్ర ప్రమాణం చేశారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర నాయకులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 78 స్థానాల్లో విజయం సాధించిన బిజెపి రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1997 నుంచి 2000 వరకు సర్పంచిగా పనిచేసిన మాఝీ 2000లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన ఆయన... కేంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు 2000, 2009, 2019, మళ్లీ 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

లింగ సమానత్వంలో అంతంత మాత్రమే !

- డబ్ల్యుఇఎఫ్ సూచీలో భారత్‌కు 129వ ర్యాంక్
- ఆర్థిక ప్రాతినిధ్యం, అవకాశాల విషయాల్లో స్వల్ప మెరుగుదల

న్యూఢిల్లీ : లింగ సమానత్వ విషయంలో భారత్ అంతంత మాత్రంగానే ఉంది. ఈ విషయాన్నిప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) విడుదల చేసిన అంతర్జాతీయ లింగ సమానత్వ సూచీ వెల్లడించింది. ఈ సూచీలో భారత్ గతం కంటే రెండు స్థానాలు కిందకు జారి 129వ స్థానంలో నిలిచింది. ఐస్‌ల్యాండ్ మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంది. డబ్ల్యుఇఎఫ్ ఈ ర్యాంకుల వివరాలను బుధవారం ప్రచురించింది. దక్షిణాసియాలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ తర్వాత ఐదోస్థానంలో భారత్ వుంది. పాకిస్తాన్ చిట్టచివరి స్థానంలో నిలిచింది. అంతర్జాతీయంగా చూసినట్టైతే 146 దేశాల సూచీలో సూడాన్ అట్టడుగు స్థానంలో నిలవగా, పాకిస్తాన్ మూడుస్థానాలు దిగజారి 145కి చేరుకుంది.

అత్యంత తక్కువ స్థాయిలో ఆర్థిక సమానత్వం నెలకొన్న దేశాల సరసన భారత్ స్థానం సంపాదించుకుంది. అంచనా వేసిన ఆదాయాల్లో 30శాతం కన్నా తక్కువగా లింగ సమానత్వం వున్న దేశాలుగా బంగ్లాదేశ్, సూడాన్, ఇరాన్,

పాకిస్తాన్, మొరాకోలతో పాటు భారత్ కూడా నమోదైంది.అయితే సెకండరీ విద్యకు సంబంధించి చూసినట్టైతే భారత్ ఉత్తమ స్థానంలో నిలిచింది. అలాగే మహిళలకు రాజకీయ సాధికారత విషయంలో కూడా అంతర్జాతీయంగా భారత్ 65వ స్థానంలోవుంది. ఇక గత 50ఏళ్లలో పురుషులు లేదా మహిళలు దేశాధినేతలుగా వున్న కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టైతే భారత్ 10వ స్థానంలో వుంది.

140కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌లో 2024లో భారత్‌లో లింగ సమానత్వం 64.1శాతంగా వుంది. గతేడాది 127వ స్థానంలో వుండగా, ఈసారి రెండు స్థానాలు దిగజారి 129కి వచ్చింది. విద్యా సంబంధమైన, రాజకీయ సాధికారతకు సంబంధించిన ప్రామాణికాల్లో కొద్దిగా తగ్గుదల వల్లనే ఈ పరిస్థితి ఎదురైంది. మరోవైపు ఆర్థిక ప్రాతినిధ్యం, అవకాశాల విషయంలో కొద్దిగా మెరుగుపడింది. భారతదేశ ఆర్థిక సమానత్వం గత నాలుగు సంవత్సరాలుగా మెరుగవుతూ వచ్చిందని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది.

ఇక రాజకీయ సాధికారత ఉప సూచికలో దేశాధినేతల విషయంలో భారత్ టాప్ 10లో వుండగా, సమాఖ్య స్థాయిలో మహిళా ప్రాతినిధ్యానికి సంబంధించి చూసినట్టైతే, మంత్రి వర్గ పదవుల్లో (6.9శాతం), పార్లమెంట్‌లో (17.2శాతం), మిగిలిన అంశాల్లో ఇంకా చాలా తక్కువగా వుందని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది. ప్రస్తుతం ప్రపంచంలో లింగ స మానత్వం 68.5శాతంగా వుందని, పూర్తి స్థాయి సమానత్వం రావాలంటే ఐదు తరాల పాటు అంటే మరో 134 ఏళ్ళు పడుతుందని పేర్కొంది. కొన్ని మెరుగైన అంశాలు వున్నప్పటికీ ఈ ఏడాది అంతర్జాతీయ లింగ సమానత్వ నివేదికలో ప్రముఖంగా పేర్కొన్న అంశాలను దృష్టిలో పెట్టుకుంటే లింగ సమానత్వం, ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వాన్ని సాధించడానికి ఇంకా నిబద్ధతతో పునరంకితం కావాల్సిన అవసరం వుందని డబ్ల్యుఇఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జహిది తెలిపారు.

సమానత్వం కోసం 2158వరకు ఆగలేం. నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పేర్కొన్నారు. ఐస్‌ల్యాండ్ తర్వాత స్థానాల్లో ఫిన్లాండ్, నార్వే, న్యూజిలాండ్, స్వీడన్‌లు వున్నాయి. బ్రిటన్ 14వ స్థానంలో వుండగా, అమెరికా 43వ స్థానంలో నిలిచింది.

పోలీసు బలగాల్లో నేరస్తులను సంహించం

- కేరళ సిఎం విజయన్ స్పష్టీకరణ

తిరువనంతపురం : పోలీసు బలగాల్లో నేరస్తుల పట్ల ఏ మాత్రమూ ఉదాసీనత వహించేది లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. 2024-25 సంవత్సరానికి పోలీసు విభాగానికి పద్దులపై బుధవారం చర్చ సందర్భంగావిజయన్ అసెంబ్లీలో మాట్లాడారు. గత ఎనిమిదేళ్ళలో, 108మంది పోలీసు అధికారులను సర్వీస్ నుండి తొలగించామన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని పరిరక్షించే వారే నేరస్తులుగా మారితే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలు విశ్వసనీయత కోల్పోతారని విజయన్ వ్యాఖ్యానించారు. పోలీసు బలగాల్లో చాలా కొద్దిమంది మాత్రమే అటువంటి తప్పుడు ధోరణులు ప్రదర్శిస్తారని అన్నారు. క్రమశిక్షణ కలిగిన బలగాలుగా పోలీసుల చర్యలను, కార్యకలాపాలను వివిధ స్థాయిల్లో సమీక్షిస్తాం. అటువంటి పరిస్థితుల్లో పోలీసులు ఎవరితో స్నేహం చేస్తారో వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వడుతుందని విజయన్ పేర్కొన్నారు. నేరాలు చేయడమే అలవాటుగా మారిన, గ్యాంగ్‌స్టర్ ఇటీవల ఎర్నాకులంలో ఇచ్చిన ఒక విందుకు డిఎస్‌పి హాజరైన సంఘటనను ఆయన ఉదహరించారు. పార్టీలకు రావాల్సిందిగా ఆహ్వానాలు వచ్చినపుడు, ఫోటోలకు పోజిచ్చేపుడు పోలీసు అధికారులు అప్రమత్తంగా వుండాలని కోరారు. రాష్ట్రంలో పోలీసు బలగాల్లో మహిళల సంఖ్యను 15శాతానికి పెంచుతామన్నారు. 2016లో ఆరు శాతంగా వుండేదని ఇప్పుడది 11.37శాతానికి పెరిగిందన్నారు.

నిరుద్యోగం సమస్యే కాదు

- అరవింద్ పనగారియా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వానికి స్వామి భక్తిని ప్రకటించుకోవడంలో ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా పోటీ పడుతున్నారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంటే.. పిజి, పిహెచ్‌డిలు చేసిన వారు అటెండర్ పోస్టులకు పోటీపడుతుంటుంటే.. అరవింద్ పనగారియా మాత్రం నిరుద్యోగం పెద్ద సమస్యనే కాదని చెప్పడం గమనార్హం. ఎన్‌డిటివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పనగారియా మాట్లాడుతూ.. భారతదేశ ప్రధాన సవాలు ఉద్యోగాలను సష్టించడం కాదన్నారు. ఎక్కువ శ్రమతో కూడిన రంగాలకు మూలధనాన్ని కేటాయించడం ద్వారా ఉపాధిని పెంచవచ్చున్నారు. భారతదేశంలో నిరుద్యోగం పెరుగుతోందని ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు బిజెపి ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు చేసిన విషయం తెలిసిందే. పలు రంగాలకు భారీగా మూలధనం అవసరం ఉంటుందని.. కానీ వాటిలో తగినంత కార్మికులకు అవకాశాలు ఉండవని పనగారియా అన్నారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే రంగాలకు మూలధనాన్ని మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాబోయే బడ్జెట్‌కు సిద్ధమవుతున్న తరుణంలో తనకు ఇది ఒక ముఖ్యమైన పరీక్ష అని పనాగరియా పేర్కొన్నారు. దేశం పరిస్థితిని అంచనా వేయడానికి ఎకనామిక్స్ టైమ్స్ ఇటీవల ఒక సర్వే చేసింది. ఎన్‌డిఎ ప్రభుత్వానికి నిరుద్యోగం ప్రధాన సవాలు అని గుర్తించింది. దీనికి తోడు ద్రవ్యోల్బణం, అసమానత, రైతుల సమస్యలు, నిరంకుశత్వం పెరగడం, జైలులో ఉన్న ప్రతిపక్ష నాయకుల సంఖ్య పెరుగుతోండటంపై ఆందోళన వ్యక్తం అయ్యింది. దేశంలో నిరుద్యోగం ప్రమాదకరస్థాయికి చేరిందని ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు కూడా గత నెలలో ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్థిక నిపుణులు నిరుద్యోగంపై ఆందోళన వ్యక్తం చేస్తోంటే.. మరోవైపు పనగారియా మాత్రం అది సమస్యనే కాదని పేర్కొనడం గమనార్హం.

దాడులపై వైసిపి పిల్

ప్రజాశక్తి-అమరావతి

ఇటీవల జరిగిన చట్టసభల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా కొంతమందిని లక్ష్యం చేసుకుని ఏకపక్షంగా దాడులు జరుగుతున్నాయని, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని పేర్కొంటూ వైసిపి నేత, రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌ను గురువారం న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ విచారించనుంది. ప్రతివాదులుగా కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను చేర్చారు.

యుద్ధ ప్రాంతాల్లో బాలలపై పెరిగిన హింస

- గతేడాది ఉధృత స్థాయికి పెరిగిన వైనం
- ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి

న్యూయార్క్ : గాజాతో సహ యుద్ధాలు, ఘర్షణలు నెలకొన్న ప్రాంతాల్లో పిల్లలపై హింస గతేడాది కాలంలో బాగా ఎక్కువై పోయిందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రాంతాల నుండి సూడాన్ వరకు, మయన్మార్ నుండి ఉక్రెయిన్ వరకు సంక్షోభాలు నెలకొన్న అన్ని చోట్లా గతంలో ఎన్నడూ లేని రీతిలో హత్యలు, గాయపడడం ఎక్కువైపోయిందని ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. సాయుధ ఘర్షణల్లో పిల్లలు అనే అంశంపై వార్షిక నివేదికను మంగళవారం వెలురించారు. ఘర్షణల్లో 18ఏళ్ళలోపు పిల్లలపై దారుణమైన సంఘటనలు ఏకంగా 21శాతం పెరిగాయని పేర్కొంది. కాంగో, బుర్కినా ఫాసో, సోమాలియా, సిరియా వంటి ప్రాంతాలను ఇందుకు ఉదాహరణలుగా పేర్కొంది. స్కూళ్ళు, ఆస్పత్రులపై దాడులకు దిగుతూ పిల్లల హక్కులను కాలరాచివేస్తున్న ఇజ్రాయిల్ బలగాలను మొట్టమొదటిసారిగా ఐక్యరాజ్యసమితి బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది.

గాజాలో ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున చేపట్టిన సైనిక ప్రతీకార చర్యలతో పిల్లలపై దాడులు 155 శాతం పెరిగిపోయాయని ఆ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా గాజాలో రద్దీగా వున్న ప్రాంతాల్లో పేలుడు పదార్ధాలను ఉపయోగించి కిరాతక దాడులకు పాల్పడ్డారని ఆ నివేదిక విమర్శించింది. కాగా ఉక్రెయిన్‌లో దాడులకు పాల్పడినందుకు రష్యా సాయుధ బలగాలను, అనుబంధ సాయుధ గ్రూపులను ఐక్యరాజ్య సమితి వరుసగా రెండో ఏడాది బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. సూడాన్, మయన్మార్‌ల్లో అధికారం కోసం ప్రత్యర్ధుల మధ్య జరుగుతున్న పోరులో పిల్లలే ప్రధానంగా బలవుతున్నారని పేర్కొంది. 2023లో ఇది ఏకంగా 480శాతం పెరిగిందని తెలిపింది. సూడాన్ సాయుధ బలగాలను, ప్రత్యర్ధి పారామిలటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్‌లను కూడా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది.

2023 చివరి నాటికి, 1526మంది పిల్లలపై 1721 ఘోరమైన నేరాలు జరిగాయని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ పేర్కొన్నారు. మొత్తంగా గతేడాది తీవ్రవాద కార్యకలాపాలకు పిల్లలను రిక్రూట్ చేయడం, చంపేయడం, వైకల్యం కలిగించడం, లైంగిక హింస, దాడులు వంటి అనేక నేరాలకు వారు బలవుతున్నారని పేర్కొంది. మయన్మార్‌లో కూడా ఈ నేరాలు 123శాతం పెరిగాయని తెలిపింది. ఆ దేశ సాయుధ బలగాలను కూడా ఈ ఏడాది బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. మొత్తంగా 2023లో పిల్లలపై 30,705 ఉల్లంఘనలు జరగ్గా, వారిలో 15,800మంది బాలురు, 6,250మంది బాలికలు వున్నారని తెలిపింది. వీరిలో కొంతమందిపై పదే పదే దాడులు, హింస, అత్యాచారాలు జరిగాయని పేర్కొంది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎమ్‌డి వాసుదేవరెడ్డి పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

సిఐడి నమోదు చేసిన కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎసిబిసిఎల్) మాజీ ఎమ్‌డి డి వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ పూర్తి చేసే వరకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్నారు. ఎపిఎస్‌బిసిఎల్ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, పత్రాలు, కంప్యూటర్ పరికరాలను వాసుదేవరెడ్డి కారులో తీసుకువెళుతుంటే చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సిఐడికి ఫిర్యాదు చేశారు. దీనిపై సిఐడి కేసు నమోదు చేసింది. అధికార పత్రాల తరలింపు, ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర వంటి అభియోగాలతో కేసు నమోదు చేసింది. హైదరాబాద్ నానక్‌రాంగూడలోని వాసుదేవరెడ్డి ఇంట్లో సిఐడి సోదాలు కూడా చేసింది. ఈ నేపథ్యంలో తనకు ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్షతోనే తనపై కేసు నమోదు చేశారనే పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

మస్క్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

న్యూయార్క్ : టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెలుగుచూసాయి. ఈ మేరకు 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం ప్రచురించింది. తన సంస్థ స్పేస్‌ఎక్స్‌లో పని చేసే పలువురు మహిళా ఉద్యోగినులపై మస్క్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాని తెలిపింది. కొంత మంది ఉద్యోగినులతో మస్క్ లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు పేర్కొంది. ఇంటర్న్ కోసం వచ్చిన ఓ యువతి కూడా అందులో ఉన్నట్లు తెలిపింది. మస్క్ తన కంపెనీలో మహిళలకు అసౌకర్య వాతావరణాన్ని కల్పించారంటూ 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' తాజా కథనంలో ఆరోపించింది. గతంలో ఎలాన్ మస్క్ కంపెనీలో పనిచేసి వెళ్లిపోయిన మహిళల నుంచి వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. మస్క్‌కు డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందని.. అప్పుడప్పుడు బోర్డ్ సభ్యులతో కలిసి వాటిని తీసుకునేవారని పేర్కొంది. ఈ క్రమంలోనే మహిళా ఉద్యోగులతో లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు తెలిపింది. తన పిల్లలకు తల్లి కావాలని ఓ ఉద్యోగినిని ఆయన కోరినట్లు వెల్లడించింది. శృంగారంలో పాల్గొంటే గుర్రాన్ని బహుమతిగా ఇస్తానని 2016లో మస్క్ చెప్పినట్లు మరో మహిళ వివరించినట్లు తాజా కథనం పేర్కొంది. కంపెనీలో మహిళల కంటే పురుషులకే మస్క్ ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారట. ఒక్క వేతనం విషయంలోనే వ్యత్యాసం ఉండేదని మాజీ ఉద్యోగిని ఒకరు ఆరోపించారు. మస్క్‌పై వచ్చిన ఈ కథనం సంచలనంగా మారింది. అయితే గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్ భార్య నికోల్ షానన్‌తో మస్క్ వివాహేతర సంబంధం సాగించారని ఇటీవల న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ సంబంధం కారణంగా సెర్గీ దంపతులు విడిపోయారని పేర్కొంది. ఈ క్రమంలోనే మరోసారి మస్క్ గురించి ఇలాంటి ఓ కథనం ప్రచురితమవడం చర్చనీయాంశమైంది.

ఫోన్ ట్యాపింగ్ నిందితులకు కోర్టులో ఎదురుదెబ్బ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు నాంపల్లి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అడిషినల్ ఎస్పిలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు బుధవారం కొట్టివేసింది. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఇంకా విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్ మంజూరు చేయొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి) కోర్టును కోరారు. బెయిల్ పిటిషన్లపై మంగళవారమే వాదనలు పూర్తికాగా.. ఈ పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయమూర్తి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

యుద్ధ నేరాలకు పాల్పడిన ఇజ్రాయిల్

- ఐక్యరాజ్యసమితి విచారణా కమిషన్
- హమాస్ పైన విమర్శ

న్యూయార్క్ : గాజాపై ఇజ్రాయిల్ దాడులు సాగించిన తొలినాళ్ళలో ఇజ్రాయిల్, హమాస్ రెండు పక్షాలూ యుద్ధ నేరాలకు పాల్పడ్డాయని ఐక్యరాజ్య సమితి విచారణలో తేలింది. వేధింపులు, హత్యలు లేదా ఉద్దేశ్యపూర్వకంగానే చంపడం, వ్యక్తిగతంగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం, అమానవీయమైన లేదా దారుణమైన వ్యవహార శైలి వంటి యుద్ధ నేరాలకు ఇరు పక్షాలు పాల్పడ్డాయని విచారణా కమిషన్ పేర్కొంది. తీవ్రంగా ప్రజా నష్టం జరిగినందున మానవాళికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ చేపట్టిన చర్యలు యుద్ధ నేరాలేనని స్పష్టం చేసింది. గతేడాది అక్టోబరు 7వ తేదీన హమాస్ జరిపిన దాడులపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ ఒక నివేదిక, దానికి ఇజ్రాయిల్ మిలటరీ ప్రతిస్పందనపై మరో నివేదికను ఐక్యరాజ్య సమితి విడుదల చేసింది. ఆ రెండు నివేదికలను ఐక్యరాజ్య సమితి విచారణా కమిషన్ (సిఓఐ) ప్రచురించింది. ఇజ్రాయిల్‌లో, ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాల్లో జరిగిన అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వారిని గుర్తించాలని, అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించాలని ఈ విచారణా కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. అందుకు అనుగుణంగా విచారణ చేపట్టింది.

కాగా ఇజ్రాయిల్ ఈ నిర్ధారణలను, నివేదికలను తోసిపుచ్చింది. విచారణా కమిషన్‌తో ఇజ్రాయిల్ సహకరించదని స్పష్టం చేసింది. విచారణా కమిషన్ ఇజ్రాయిల్ వ్యతిరేక వైఖరితో పనిచేస్తోందని విమర్శించింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం తమ కార్యకలాపాలకు అడ్డం తగిలిందని, తమ దర్యాప్తు అధికారులు ఇజ్రాయిల్‌లో, ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో పర్యటించకుండా అడ్డుకుందని విచారణా కమిషన్ విమర్శించింది. ఐక్యరాజ్య సమితిలోని ఇజ్రాయిల్ దౌత్య కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా సంకుచిత స్వార్ధ ప్రయోజనాలతోనే ఈ చర్యలన్నీ వున్నాయని విచారణా కమిషన్ మరోసారి రుజువు చేసిందని ఇజ్రాయిల్ రాయబారి మైరవ్ ఇలన్ షహార్ విమర్శించారు. కాగా హమాస్ దీనిపై తక్షణమే స్పందించలేదు.

ఇజ్రాయిల్ లెక్కల ప్రకారం హమాస్ దాడిలో 1200మంది చనిపోయారని, 250మందిని బందీలుగా తీసుకెళ్ళారని చెబుతుండగా, గాజాపై జరిగిన దాడుల్లో ఇప్పటివరకు 37వేల మందికి పైగానే మరణించారని పాలస్తీనా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ యుద్ధ నేరాలకు తోడు ఇజ్రాయిల్ అదనంగా మరికొన్ని దారుణాలకు పాల్పడిందని, ప్రజలను కరువు కాటకాలతో అల్లాడేలా చేయడం యుద్ధ తంత్రంలో ఒక పద్ధతని, ఇజ్రాయిల్ ఆ తరహా చర్యలకు దిగిందని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఆహారం, నీరు, ఆశ్రయం, మందులు వంటి నిత్యావసరాలు కూడా అందకుండా చేసిందని పేర్కొంది. గాజాలో పెద్ద సంఖ్యలో పౌర నష్టం, మౌలిక వసతులకు, పౌర నివాసాలకు విస్తృత స్థాయిలో విధ్వంసం జరగడం ఇవన్నీ కూడా గరిష్ట స్థాయిలో నష్టాన్ని కలగచేయాలనే ఉద్దేశ్యంతోనే అనుసరించిన వ్యూహమని విచారణా కమిషన్ పేర్కొంది. మూకుమ్మడి హత్యలు, లైంగిక హింస వంటి రూపాల్లో అధిక నేరాలు జరిగాయని తెలిపింది. 126 పేజీలతో ఇజ్రాయిల్ చర్యలపై నివేదికను విడుదల చేయగా, హమాస్ దాడులపై 59పేజీలతో నివేదికను ఇచ్చింది.అంతర్జాతీయ మానవతా చట్టానికి పూర్తి విరుద్ధంగా పట్టణ ప్రాంతాల్లో అత్యంత విధ్వంసకర సామర్ధ్యం కలిగిన బాంబులను ఉపయోగించారని పేర్కొంది. బాధితులు, సాక్షులతో ఇంటర్వ్యూలు, వందలాది ప్రకటనలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వైద్య నివేదికలు, నిర్ధారించబడిన బహిరంగ వర్గాల ద్వారా అందిన సమాచారం వీటన్నింటి ప్రాతిపదికన విచారణా కమిషన్ తన నివేదికలను రూపొందించింది.

బాధల్లో 86% మంది ఉద్యోగులు

- భారత్‌లో 14% మంది మాత్రమే వృత్తిపై ఆసక్తి
- నేపాల్ కంటే తక్కువ
- గల్లుప్ వర్క్‌ప్లేస్ రిపోర్ట్

న్యూఢిల్లీ : భారత్‌లో 86 శాతం మంది ఉద్యోగులు కష్టపడుతూ, బాధపడుతూనే పని చేస్తున్నారని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. మిగతా 14 శాతం మంది మాత్రమే వృత్తిపై ఆసక్తితో.. నిత్యం అభివృద్ధి చెందుతున్నట్లు భావిస్తున్నారు. కాగా.. ప్రపంచంలో 34 శాతం మంది ఉద్యోగులు తమ వృత్తి పట్ల సంతోషం, ఆసక్తిని కనబర్చుతున్నారని 'గల్లుప్ 2024 స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ వర్క్‌ప్లేస్' నివేదిక వెల్లడించింది. ప్రపంచ సగటుతో పోల్చితే భారత్‌లో ఎక్కువ మంది ఉద్యోగులు అసంతృప్తిగానే తమ పనిని నెట్టుకొస్తున్నారు. ఉద్యోగులను అభివృద్ధి చెందుతున్న, కష్టపడుతున్న, బాధపడుతున్న ఉద్యోగులుగా మూడు కేటగిరీలుగా విభజించి గల్లుప్ ఈ రిపోర్ట్‌ను తయారు చేసింది. ప్రస్తుత వృత్తి జీవితంతోపాటు భవిష్యత్తు పట్ల సానుకూల దక్పథాన్ని కలిగి ఉన్నవారిని అభివృద్ధి చెందుతున్న వారిగా పరిగణించారు. దీనికి విరుద్ధంగా వృత్తిలో ప్రతికూల వాతావరణాన్ని అనుభవిస్తున్న వారు, రోజువారీ ఒత్తిడి, ఆర్థిక ఆందోళనలను ఎదుర్కొంటున్నవారిని కష్టపడుతున్న, బాధపడుతున్న కేటగిరీలోకి చేర్చారు.

దక్షిణాసియాలో పనిపై ఆసక్తి, అభివృద్ధి చెందుతున్న కేటగిరీలో 15 శాతం ఉద్యోగులున్నారు. నేపాల్ ఇది 22 శాతంగా ఉంది. ఇది భారత్‌లో14 శాతంగా ఉండటం విశేషం. శ్రీలంకలో అత్యధికంగా 62 శాతం, ఆఫ్ఘనిస్తాన్‌లో 58 శాతం ఉద్యోగులు రోజువారీ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. భారత్‌లో ఇది 35 శాతంగా ఉంది. కష్టపడే వారిలో ఎక్కువ మంది తమకు ఆహారం, ఆశ్రయం, ప్రాథమిక అవసరాలు తీర్చుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగోలో బోటు మునిగి 80మందికి పైగా మృతి

బ్రజవిల్లె : కాంగోలో బుధవారం జరిగిన బోటు ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న 80మందికి పైగా మరణించారని కాంగో అధ్యక్షుడు ఫెలిక్స్ షిస్కెడి తెలిపారు. క్వా నదిలో జరిగిన ఈ ప్రమాదంపై దర్యాప్తు జరపాల్సిందిగా అధ్యక్షుడు ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. మరణించిన వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలియచేశారు. బాధితులకు అవసరమైన సాయాన్ని అందించాల్సిందిగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కాంగోలో ఇలాంటి బోటు ప్రమాదాలు చాలా సర్వ సాధారణం. సామర్ధ్యానికి మించి బోటులో ప్రయాణించడం అక్కడ తరచుగా జరుగుతూ వుంటుంది. ఆ దేశంలో తారు రోడ్లు చాలా తక్కువ. ఎక్కడికెళ్ళాలన్నా నదుల్లో ప్రయాణించాల్సిందే.

మీకోసం

చేపముక్కలకు కొద్దిగా ఉప్పు కలిపి డీప్‌ఫ్రిజ్‌లో ఉంచితే ఒకదానికొకటి అంటుకోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం.. ప్రతి వ్యక్తికి అవసరం.

మెరిసే ఆకులు

కూరలు కూరలు
ఆకు కూరలు
మెరిసే పచ్చని ఆకులు
చిట్టి పొట్టి ఆకులు
చేవ ఉన్న ఆకులు

కూరలు కూరలు
ఆకు కూరలు
చౌకగ దొరికే ఆకులు
పంటిని, కంటిని కాపాడే ఆకులు
పప్పుకు, సూప్‌కు రుచినిచ్చే ఆకులు

కూరలు కూరలు
ఆకు కూరలు
ఎముకలకి బలాన్నిచ్చే వస్తాదులు
యాంటికాన్సర్ ఏజెంట్‌లు
సూక్ష్మ పోషకాల రాశులు

కూరలు కూరలు
ఆకు కూరలు
మెంథాల్ ఆయిల్‌ని ఇస్తాయి
గోగునారతో బుట్టని అవుతాయి
మతిమరపును ఆమడదూరం తరిమేస్తాయి

కూరలు కూరలు
ఆకు కూరలు
అన్ని కాలాలలో దొరికే కూరలు
పిన్నలకు, పెద్దలకు
ఆరోగ్యాన్నిచ్చే సంజీవని ఆకులు

- డా.నీరజ అమరవాది,
98491 60055.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, కింద ఇచ్చిన పట్టికలో తరువాత వచ్చే అక్షరాలను మీరు రాయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

అ	ఆ	జ	-
ఈ	-	ర	-
ఏ	-	ల	-
ఔ	-	మ	-
గ	-	వ	-

బొమ్మరిల్లు

ఎ.చేతన్ ఆనంద్, 6వ తరగతి, పల్లవి మోడల్ స్కూలు, బోడుప్పల్, హైదరాబాద్.

నేను గీసిన బొమ్మ

కొమ్మనబోయిన కారుణ్య అకుల్, 4వ తరగతి, కెనడీ హైస్కూలు, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చిన్నారి పెద్ద మనసు

చదువుతో పాటు వివిధ కళల్లో రాణిస్తున్న పిల్లలను చూస్తుంటే భలే ముచ్చటేస్తుంది. నాట్యం, సంగీతం, ఆటలు ఏ రంగంలోనైనా పిల్లలు చూపించే విశేష ప్రతిభ పెద్దలను తెగ సంతోషపెడుతుంది. అలాగే తమ అభిరుచి, ఆకాంక్షల కోసం వివిధ కళల్లో రాణించే పిల్లలు, పెద్దల్లాగా సామాజిక స్పృహతో, సేవాగుణంతో నడుచుకుంటుంటే మాత్రం వాళ్ల గురించి తప్పక చెప్పుకోవాలి. అటువంటి వారిలో ఒక బాలికే, ఒంగోలుకి చెందిన హేమ సాయి. 13 ఏళ్ల ఈ చిన్నారి కూచిపూడి నృత్యంలో ఎంతో నైపుణ్యం సాధించింది. తన నాట్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. అవార్డులు రివార్డులకు కొదవే లేదు. ఇంతటి విశేష నైపుణ్యం గల ఈ చిన్నారిలో సేవాగుణం కూడా మెండుగానే ఉంది. వివిధ స్వచ్ఛంద సంస్థల తరపున సోలో ప్రదర్శనలు ఇస్తూ, వచ్చిన సొమ్మును క్యాన్సర్ రోగుల సేవ కోసం వినియోగిస్తోంది.

సింగంశెట్టి హేమ సాయి 8వ తరగతి చదువుతోంది. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన హేమ తల్లి జగదీశ్వరి గృహిణి, తండ్రి జయేంద్ర ప్రైవేటు సంస్థలో పనిచేస్తారు. హేమ, చదువులో చురుకైన విద్యార్థి. చదువుతో పాటు నాట్యం తనకు అదనపు ఆభరణం. నాట్యం పట్ల తల్లికి ఉన్న అభిరుచి పిల్లలను ఆ రంగం వైపు నడిపించింది. హేమ సోదరుడు అంజన్ కూడా కూచిపూడి డ్యాన్సరే. తల్లి ఇచ్చిన ప్రోత్సాహంతో బిడ్డలిద్దరు అనేక నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. హేమ ఒక్కత్తే దక్షిణ భారతదేశ వ్యాప్తంగా 500 పైగా ప్రదర్శనలు ఇచ్చింది.

వీటిల్లో ఎక్కువ భాగం నిధుల సేకరణ కోసం ఏర్పాటుచేసినవి. అనాథలకు, క్యాన్సర్ రోగులకు సాయం అందించడంలో వాటిని వినియోగించేవారు.

వందల ప్రదర్శనలు ఇచ్చిన హేమకు ఇప్పటి వరకు ఆసియన్ వరల్డ్ రికార్డ్స్, ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, బ్రిటీష్ వరల్డ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, యునిక్యూ వరల్డ్ రికార్డ్స్ నుండి సర్టిఫికెట్లు వచ్చాయి. ఇటీవల నిర్వహించిన మెగా కూచిపూడి నృత్యోత్సవంలో పాల్గొని గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కూడా సాధించింది. కళల్లో రాణించడం, ఆ కళను ఇతరులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవడంలో హేమ చూపిస్తున్న మార్గం అనుసరణీయం, అభినందనీయం.

వాహనదారులూ, వర్షం వేళ జాగ్రత్త !

వర్షాకాలం మొదలైంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతుంటాయి. పట్టణాల్లో అయితే డ్రైనేజీ నీళ్లు వీధుల్లోకి వచ్చేస్తాయి. ముఖ్యంగా వర్షం పడేటప్పుడు డ్రైనేజీ నీళ్లు, రోడ్డుపై నీళ్లు కలిసిపోయి, ఏది సరైన దారో తెల్చుకోలేం. ఇలాంటి సమయంలో పాదచారులు, బైక్‌లపై ప్రయాణించే వాళ్లు చాలా జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా వాహనదారులు కొన్ని జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలి. రోడ్ల మీద నీళ్లు ఎక్కువగా ఉండటం వల్ల బైక్ జారి కింద పడే అవకాశం ఉంటుంది.. కాబట్టి వర్షాలు రాకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చు.

- వర్షాకాలం రాకముందే వాహనాలను చెక్ చేయించాలి. ఏదైనా లోపాలు ఉంటే సర్వీసు చేయించాలి.
- పాత టైర్లు అరిగిపోయినట్లయితే వెంటనే మార్చించుకోవాలి. అలా చెయ్యకపోతే టైర్లకు పంక్చర్ అవుతుంది. నీళ్లల్లో వెళ్లేటప్పుడు పాత టైర్లు పట్టును కోల్పోయి స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది.
- ఇండికేటర్ పనితీరును కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. ఇతరత్రా ఏదేని మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించుకోవాలి.
- వర్షం కారణంగా చీకటిగా ఉంటుంది. హెడ్ లైట్, టెయిల్ లైట్లు పనిచేయకపోతే ఇలాంటి సమయంలో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. కాబట్టి లైట్ల పనితీరును పరిశీలించుకుని కొత్తవి అమర్చుకోవాలి.
- అలాగే బ్రేక్లను చెక్ చేయించుకోవాలి. ఒక్కొక్కసారి బ్రేక్‌లు గట్టిగా బిగుసుకుపోయి బైక్ సమయానికి ఆగదు. దీనివల్ల కూడా బైక్ స్కిడ్ అవుతూ ఉంటుంది. కాబట్టి బైక్ సర్వీసింగ్ చేయించుకోవడం మంచిది.
- హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. రోడ్లపై నీళ్లు, తడిగా ఉండటం వల్ల బైక్ స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి హెల్మెట్ ఉంటే ప్రమాదం బారిన పడకుండా ఉండొచ్చు.
- అలాగే బైకు సీటు కవర్‌ను కూడా మార్పించాలి.



అలవాట్లను గాడిలో పెట్టుకోవాలి..

కొంతకాలంగా చాలామంది జీవన శైలి మారింది. స్ట్రీట్ ఫుడ్‌కే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. ఆన్‌లైన్ భోజనం అందుబాటులోకి వచ్చాక ఈ ఒరవడి మరింత పెరిగింది. ఇదంతా పక్కన బెడితే, మరోపక్క మనం తినే తిండి, రోజువారీ పనులు ఆరోగ్యకరమైన పద్ధతుల్లో ఉండడం లేదు. ఉదాహరణకు తరచుగా మాంసాహారం తినడం, టీవీ చూస్తూ తినడం, పనిలో పడి నిద్రను వాయిదా వేయడం.. వంటివన్నీ రోజువారీ జీవితంలో సర్వసాధారణమై పోయాయి. ఈ అలవాట్లు ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలో ఏ అలవాటు అధికంగా ఉన్నా, దానిని వెంటనే మానుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

కొందరికి ముక్కలేనిదే ముద్ద దిగదు. తరచూ చికెనో, మటనో, చేపలో వండుకుని తింటూ ఉంటారు. మాంసాహారం తింటే శరీరానికి ప్రొటీన్ పుష్కలంగా అందుతుందని బలంగా నమ్ముతారు. అయితే తరచుగా మాంసాహారం తినడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాహారం తినడం వల్ల క్యాన్సర్ ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

తినడమే కాదు, సరైన భంగిమలో కూర్చోకపోవడం, ఒకే భంగిమలో ఎక్కువ సమయం కూర్చుని ఉండటం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. చాలా మంది టీవీ చూస్తూ.. చిత్రవిచిత్రంగా కూర్చొంటారు. పైగా టీవీ చూస్తూ తినడం వంశాచారంగా భావిస్తారు. టీవీకి కండ్లప్పగించి భోజనానికి కూర్చుంటే తిండిపై పట్టు కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, అధికంగా తినడం.. లేదంటే సగానికే చేతులు కడుక్కోవడం చేయాల్సి వస్తుంది. అంతేకానీ, సరైన మోతాదులో ఆహారం తీసుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని పలు సర్వేలు చెబుతున్నాయి. ఇదిలాగే కొనసాగితే అది రోగనిరోధకశక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

ఇక అన్నిటినీ మించి రాత్రిపూట టీవీ, మొబైల్స్‌కు అంకితం కాకుండా ఉండటం మంచిది. గ్యాడ్జెట్లను పూర్తిగా పక్కనపెట్టి.. ఏడెనిమిది గంటలు నిద్రపోవడం సర్వదా శ్రేయస్కరం అని నిపుణులు సూచిస్తున్నారు.

'హరోం హర' ప్రీ రిలీజ్ ఈవెంట్

సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక తెరకెక్కించిన చిత్రం 'హరోం హర' ఈనెల 14న విడుదల కానుంది. తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుధీర్ బాబు మాట్లాడుతూ, 'అడివి శేష్ నాకు స్ఫూర్తి. సినిమా కథల విషయంలో చాలామంది అభిప్రాయాలు తీసుకుని మార్పులు చేసుకుంటారు. ఈ రోజుల్లో ఒక హీరోకు మరో హీరో సపోర్ట్ చేసుకోవాలి. ఏ సినిమా ప్రీరిలీజ్ అయినా విశ్వక్‌సేన్ హాజరవుతారు. అది తనలో ఉన్న గొప్ప లక్షణం. 'హరోంహర'లో నేను సుబ్రహ్మణ్యం పాత్రలో కనిపిస్తాను. దీని కోసం చాలా మంది కష్టపడ్డారు. ఇప్పటివరకు ఇలాంటి కథతో ఏ సినిమా రాలేదు. నన్ను ఇలాంటి పాత్రలో చూడాలని మా మావయ్య (కృష్ణ) కోరుకున్నారు. ఆయన ఉంటే ఆనందించేవారు. ఈ చిత్ర నిర్మాతలు ఎక్కడా రాజీపడలేదు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ సుబ్రహ్మణ్యంలా ఫీలవుతారు. ముఖ్యంగా హీరో మహేశ్ బాబుకు థ్యాంక్స్ చెప్పాలి. ట్రైలర్ చూశాక చాలా సపోర్ట్ చేశారు. ఆయనతో సినిమా తీయాలంటే రెండేళ్లు పడుతుంది. ఈ గ్యాప్‌లో నేను మీ ముందుకు వచ్చి అలరిస్తాను. ఆయన ఇచ్చినంత కిక్ ఇవ్వకపోవచ్చు గానీ.. ఖచ్చితంగా మీ అందరికీ వినోదాన్ని పంచుతాను' అని చెప్పారు. ఈ సినిమా ప్రీ రిలీజ్‌కు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని అడివి శేష్ అన్నారు. సుధీర్ మంచి సినిమా చేశారన్నారు. ఇదే ఈవెంట్‌లో మహేష్‌బాబుతో మాట్లాడిన ఫోన్ రికార్డును సుధీర్‌బాబు ప్లేచేశారు. అందులో సుధీర్ అడిగిన కొన్ని ప్రశ్నలకు మహేష్‌బాబు సమాధానమిచ్చారు.

'కాంతార 1' కోసం హాలీవుడ్ సాయం

చిన్న చిత్రంగా విడుదలై బాక్సాఫీస్ ముందు భారీ విజయాన్ని అందుకున్న చిత్రం 'కాంతార'. రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తూ స్వయంగా తెరకెక్కించిన ఈ సినిమాకి ఇప్పుడు ప్రీక్వెల్ సిద్ధమవుతోంది. 'కాంతార: చాప్టర్ 1' పేరుతో సెట్స్‌పైకి వెళ్లిన ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. భారీ గ్రాఫిక్స్ హంగులతో ముస్తాబు కానున్న ఈ సినిమా కోసం ఓ ప్రముఖ హాలీవుడ్ విఎఫ్ఎక్స్ కంపెనీతో చిత్ర బృందం చేతులు కలిపినట్లు సమాచారం. 'ది క్రానికల్స్ ఆఫ్ నార్నియా', 'ది లయన్ కింగ్', 'బాట్‌మ్యాన్' లాంటి విజయవంతమైన హాలీవుడ్ సినిమాలకు విజువల్ ఎఫెక్ట్స్ అందించిన ఆ సంస్థ ఇప్పుడు ఈ ప్రీక్వెల్ కోసం పని చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు యూఎస్, యూకేల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో పాత్ర కోసం రిషబ్ ఇప్పటికే కళరిపయట్టు, గుర్రపు స్వారీలో కఠిన శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: అరవింద్ కశ్యప్.

'యేవమ్' అలరిస్తుంది

చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆష రెడ్డి ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాష్ దంతులూరి . దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రకాష్ దంతులూరి బుధవారం మీడియాతో ముచ్చటించారు. 'హిందీలో లగాన్, తెలుగులో ఖుషి సినిమాలు నన్ను దర్శకుడిగా మారడానికి ప్రేరణ ఇచ్చాయి. నేను రాసుకున్న ఓ కథ ప్రియాంక దత్‌కు వినిపించాను. అశ్వనీదత్ కూడా కథ విని నాకు దర్శకత్వం అవకాశం ఇచ్చారు. వైజయంతీ మూవీస్‌లో నా తొలి సినిమా 'ఓం శాంతి' చేశాను. అనుకోకుండా నవదీప్‌ను కలిశాను. కాన్సెప్ట్ నచ్చి ఆయన నిర్మాతగా మారారు. యేవమ్ అనేది సంస్కృత పదం. ఇతిహాసాలు, పురాణాలు చెప్పినప్పుడు ఇది ఇలా జరిగింది అని చెప్పడాన్ని యేవమ్ అంటారు. ఈ సినిమాలోని పాత్రలు రియల్‌లైఫ్‌లో సంఘటనల మాదిరిగా ఉంటాయి' అని వివరించారు.

కిరణ్ బేడీ బయోపిక్

భారతదేశపు తొలి మహిళా ఐపిఎస్ ఆఫీసర్ కిరణ్ బేడీ జీవితం వెండితెరపైకి రానుంది. 'బేడీ: ది నేమ్ యు నో.. ది స్టోరీ యూ డోన్ట్' అనే టైటిల్‌తో ఆమె బయోపిక్ తెరకెక్కనుంది. 'వన్ వే, అనదర్ టైమ్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న దర్శక నిర్మాత, రచయిత కుశాల్ చావ్లా ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. డ్రీమ్ స్లేట్ పిక్చర్స్ పతాకంపై గౌరవ్ చావ్లా ఈ సినిమాను నిర్మించనున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదలయ్యేలా ప్లాన్ చేసినట్లుగా సమాచారం.

ఆస్కార్ అకాడమీకి మన సినిమాటోగ్రాఫర్



బెంగళూరుకు చెందిన లేడీ సినిమాటోగ్రాఫర్ నేత్ర గురురాజ్ ఆస్కార్ అకాడమీ గోల్డ్ రైజింగ్ ప్రోగ్రామ్‌కి ఎంపికయ్యారు. బెంగళూరుకి చెందిన ఆమె రైటింగ్, డ్యాన్సింగ్, డైరెక్షన్, ప్రొడక్షన్ డిజైన్ ఇలా చాలా విభాగాల్లో ప్రావీణ్యురాలు. కొన్నాళ్ల ముందు సినిమాటోగ్రఫీలో మాస్టర్స్ చేసేందుకు లాస్ ఏంజెల్స్ వెళ్లారు. తాజా ఆమె తీసిన 'జాస్మిన్ ఫ్లవర్స్' షార్ట్ ఫిల్మ్.. పలు చలనచిత్రోత్సవాల్లో అవార్డులు గెలుచుకుంది. ఇప్పుడు ఆస్కార్ అకాడమీ గోల్డ్ రైజింగ్ ప్రోగ్రామ్‌కి ఎంపికైంది. ప్రపంచం నలుమూల నుంచి ఈ ప్రోగ్రామ్‌కి సెలెక్ట్ అయిన యువ సినిమాటోగ్రాఫర్స్.. రెండు నెలల పాటు అకాడమీ ఆధ్వర్యంలో ప్రొఫెషనల్స్ దగ్గర నుంచి మెళకువలు నేర్చుకుంటారు.

'కల్కి'కి 14 కోట్ల వ్యూస్

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' ఈనెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు విశేషమైన ప్రేక్షకాదరణ దక్కించుకొని లక్షల వ్యూస్‌తో ట్రెండింగ్‌లో ఉంది. హిందీలో 24 గంటల్లో 14 మిలియన్ల వ్యూస్‌ను సాధించింది. దీనిపై దర్శకుడు మీడియాతో మాట్లాడారు. 'ట్రైలర్ రిలీజైన సందర్భంగా నా మనసు భావోద్వేగానికి గురయ్యింది. పురాణాలు, సైన్స్ రెండింటిపై నాకు ఆసక్తి ఎక్కువ. ఈ రెండింటిని కలిపి సినిమా తీయాలని ఎన్నో ఏళ్ల క్రితం అనుకున్నాను. మా ఆర్టిస్టులందరి సాయంతో మైథాలజీకి సైన్స్‌ను జోడించి 'కల్కి 2898 ఏడీ' తెరకెక్కించాను. టీమ్ అద్భుతమైన ప్రతిభ, అంకిత భావం వల్లే ఇది సాధ్యమైంది. చిత్రబృందమంతా ఎంతో కష్టపడి పని చేసింది. తెలుగు ప్రేక్షకులతో పాటు. దేశంలోని వారంతా దీన్ని చూసి గర్వపడతారు' అని వివరించారు.

సూపర్-8కు టీమిండియా

- బౌలింగ్‌లో అర్ష్‌దీప్, బ్యాటింగ్‌కు సూర్యకుమార్ మెరుపులు
- అమెరికాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

న్యూయార్క్: టి20 ప్రపంచ కప్‌లో టీమిండియా గ్రూప్-ఎ నుంచి సూపర్-8కు చేరింది. నసావు కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఆతిథ్య అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో భారతజట్టు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన అమెరికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 110పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని టీమిండియా 18.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసి గెలిచింది. ఛేదనలో టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ(3), కోహ్లి(0) నిరాశపరిచినా.. వికెట్ కీపర్ పంత్(18) ఫర్వాలేదనిపించాడు. ఆ తర్వాత సూర్య కుమార్ యాదవ్(50) సూపర్ అర్ధసెంచరీకి తోడు.. శివమ్ దూబే(31) మ్యాచ్‌ను ముగించారు. దీంతో వరుసగా మూడో విజయంతో టీమిండియా 6పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సూపర్-8కు చేరింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అర్ష్‌దీప్ సింగ్‌కు లభించింది.

అర్ష్‌దీప్‌ను అభినందిస్తున్న ఆటగాళ్లు

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ × న్యూజిలాండ్
వేదిక: ట్రినిడాడ్; ఉ.6.00గం||లకు

బంగ్లాదేశ్ × నెదర్లాండ్స్
వేదిక: కింగ్స్‌స్టన్; రా.8.00గం||లకు

తొలుత బౌలర్లకు స్వర్గధామంలా మారిన పిచ్‌పై భారత పేసర్లు విజృంభించారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్(4/9) కెరీర్ అత్యుత్తమ బౌలింగ్‌కి తోడు.. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా(2/14) మరోసారి బంతితో మెరిశాడు. దాంతో, బౌన్సీ పిచ్‌పై ఆతిథ్య అమెరికా బ్యాటర్లు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 110పరుగులు చేసింది. అమెరికా జట్టులో నితీశ్ కుమార్(27), ఓపెనర్ స్టీవెన్ టేలర్(24)లు ఆదుకున్నారు. దాంతో అమెరికా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. అర్ష్‌దీప్‌కి నాలుగు, హార్దిక్‌కు రెండు, అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా ఓపెనర్ విరాట్ కోహ్లి మరోసారి నిరాశపరిచాడు. తాను ఎదుర్కొన్న తొలి బంతికే డకౌటయ్యాడు. ఆ తర్వాత రోహిత్ నిరాశపరిచినా.. పంత్-సూర్యకుమార్ ఆదుకున్నారు. ఆ తర్వాత పంత్ ఔటైనా.. సూర్యకుమార్ యాదవ్-దూబే మ్యాచ్‌ను ముగించారు.

స్కోర్‌బోర్డు..

అమెరికా ఇన్నింగ్స్: జహంగీర్ (ఎల్‌బి)అర్ష్‌దీప్ 0, స్టీవ్ టేలర్ (బి)అక్షర్ 24, ఆండ్రీ ఘోష్ (సి)హార్దిక్ (బి)అర్ష్‌దీప్ 2, జోన్స్ (సి)సిరాజ్ (బి)హార్దిక్ 11, నితీశ్ కుమార్ (సి)పంత్ (బి)హార్దిక్ 27, ఆండర్సన్ (సి)పంత్ (బి)హార్దిక్ 14, హర్మీత్ సింగ్ (సి)పంత్ (బి)అర్ష్‌దీప్ 10, షెల్వాక్ (నాటౌట్) 11, జస్దీప్ సింగ్ (రనౌట్)పంత్/సిరాజ్ 2, అదనం 9. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 110పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/3, 3/25, 4/56, 5/81, 6/96, 7/98, 8/110 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-9-4, సిరాజ్ 4-0-25-0, బుమ్రా 4-0-25-0, పాండ్యా 4-1-14-2, దూబే 1-0-11-0, అక్షర్ 3-0-24-1

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి)హర్మీత్ సింగ్ (బి)నేత్రావాల్కర్ 3, కోహ్లి (సి)గౌస్ (బి)నేత్రావాల్కర్ 0, రిషబ్ పంత్ (బి)అలీ ఖాన్ 18, సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 50, శివమ్ దూబే (నాటౌట్) 31, అదనం 9. (18.2 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 111పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/10, 3/39 **బౌలింగ్:** నేత్రావాల్కర్ 4-0-18-2, అలీ ఖాన్ 3.2-0-21-1, జస్దీప్ సింగ్ 4-0-24-0, షల్డే 4-0-25-0, ఆండర్సన్ 3-0-17-0.

అగ్రస్థానంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా

జంపా 4/12)

ఆంటిగ్వా: టి20 ప్రపంచకప్ సూపర్-8కు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ప్రవేశించాయి. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా జట్టు నమీబియాపై తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నమీబియా జట్టు ఆసీస్ బౌలర్ల ధాటికి 17ఓవర్లలో 72పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఎరాస్మస్(36), లింగ్జెన్(10) రెండంకెల స్కోర్ చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆస్ట్రేలియా స్పిన్నర్ జంపాకు నాలుగు, హేజిల్‌వుడ్, స్టొయినీస్‌కు రెండేసి, కమిన్స్, ఎల్లిస్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 5.4ఓవర్లలో వార్నర్(20)వికెట్ కోల్పోయి ఛేదించింది. హెడ్(34), కెప్టెన్ మిచెల్ మార్ష్(18) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో ఆస్ట్రేలియా వరుసగా మూడో విజయంతో 6పాయింట్లతో సూపర్-8కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఈ గ్రూప్ నుంచి స్కాట్లాండ్, ఇంగ్లండ్ జట్లు సూపర్-8కు చేరే అవకాశముంది. స్కాట్లాండ్ జట్టు ప్రస్తుతం మూడు మ్యాచ్‌లు ఆడి ఐదు పాయింట్లతో 2వ స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ జట్టు రెండు మ్యాచులు ఆడి 1 పాయింట్‌తో ఉంది. చివరి 2మ్యాచుల్లో ఆ జట్టు ఒమన్, నమీబియాలపై గెలిచి బెటర్ రన్‌రేట్ సాధిస్తే ఆ జట్టుకూ అవకాశముంది.

శ్రీలంక గ్రూప్ దశలోనే..

2014 ఛాంపియన్ శ్రీలంక జట్టు ఈసారి గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. గ్రూప్ డిలో ఉన్న లంక జట్టు దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. బుధవారం నేపాల్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో నెగ్గి సూపర్-8 రేసులో నిలవాలనుకున్న శ్రీలంక ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఫ్లోరిడాలో జరగాల్సిన ఆ మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దయింది. కనీసం ఐదు ఓవర్ల ఆటను నిర్వహించాలనుకున్నా సాధ్యపడలేదు. చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపర్లు ప్రకటించి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. దీంతో గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా మూడు విజయాలు సాధించి 6 పాయింట్లతో సూపర్-8కు అర్హత సాధించగా.. లంక జట్టు ఒక్క పాయింట్‌తో ఐదోస్థానంలో కొనసాగుతోంది. బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ 2పాయింట్లతో 2, 3 స్థానాలో ఉన్నాయి. ఆ రెండు జట్లు మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. ఈ గ్రూప్ నుంచి బంగ్లా సూపర్-8కు చేరే ఛాన్స్ ఉంది.

మహిళా స్విమ్మర్ టిట్మస్ ప్రపంచరికార్డు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మహిళా స్విమ్మర్ అరియర్నే టిట్మస్ ప్రపంచ రికార్డును నెలకొల్పింది. బుధవారం జరిగిన ఒలింపిక్స్ ట్రయల్స్ 200మీ. ఫ్రిస్టైల్ విభాగంలో టిట్మస్ ఈ రికార్డును నెలకొల్పింది. ఒలింపిక్ ఛాంపియన్ అయిన టిట్మస్ బ్రిస్బేన్ వేదికగా జరిగిన ఒలింపిక్ ట్రయల్స్ ఫ్రిస్టైల్ విభాగంలో ఒక నిమిషం 52.23సెకన్లలో గమ్యానికి చేరింది. దీంతో గత ఏడాది ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఫరొకాకు చెందిన మోరీ కలగాన్ నెలకొల్పిన ఒక నిమిషం 52.85సెకన్ల రికార్డును టిట్మస్ బ్రేక్ చేసింది. 400మీ. ఫ్రిస్టైల్‌లో విభాగంలో ఇప్పటికే ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన టిట్మస్.. తాజాగా 200మీ. విభాగదంలోనూ పారిస్ బెర్త్ దక్కించుకుంది. ఒలింపిక్ ఛాంపియన్ అయిన టిట్మస్ 400మీ. ఫ్రిస్టైల్ విభాగంలో 3నిమిషాల 55.44సెకన్లలో గమ్యానికి చేరి 0.06సెకన్లతో తృటిలో ప్రపంచ రికార్డును చేజార్చుకున్నా.. పారిస్ బెర్త్ కొట్టింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68